


శుక్రవారం 5 జూన్ 2026 పేజీలు : 8

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి



## అదనపు లారీలతో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభల్లో ప్రజా భద్రతపై అవగాహన

## నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

రామగుండం పోలీస్ కమిషనరేట్ అధికారులు

ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు గురువారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల పెద్దపల్లి జోన్లలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రామాలు, వార్డుల్లో నిర్వహించిన గ్రామ సభల్లో డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు మరియు పోలీస్ సిబ్బంది స్వయంగా పాల్గొన్నారు.






# ఎన్ ఎచ్ -63 నాలుగు లేన్ల విస్తరణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

## కేంద్ర క్యాబినెట్ ఆమోదం పట్ల ఎంపీ గడ్డం వంశీకృష్ణ హర్షం

పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని మంచిర్యాల జిల్లాకు కేంద్ర ప్రభుత్వం కీలక అభివృద్ధి వరం అందించింది. ఆర్మూర్--జగిత్యాల--మంచిర్యాల జాతీయ రహదారి (ఎన్ ఎచ్ -63)ను నాలుగు లేన్లుగా విస్తరించే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం వెనుక ఎంపీ గడ్డం వంశీకృష్ణ నిరంతర కృషి, పార్లమెంట్ స్థాయిలో చేసిన పలు విజ్ఞప్తులు ముఖ్య పాత్ర పోషించాయి. ఈ రహదారి విస్తరణతో ఉత్తర తెలంగాణలో రవాణా వ్యవస్థ మరింత బలపడనుంది.

# ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

## మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్





**మంచిర్యాల, 4, జూన్ (ప్రజాజ్యోతి):** పౌరులు ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ కోరారు . 99 రోజుల ప్రజా అభివృద్ధి ప్రణాళికలో భాగంగా గురువారం మంచిర్యాల 11వ డివిజన్ సాయి కుంట రోడ్డులోని చిన్న పాఠశాలలో గ్రామసభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, మంచిర్యాల ఏఎస్పీ ప్రకాష్, సీఐ ప్రమోద్ రావు, ఎస్సై తిరుపతి, వార్డు ఆఫీసర్ రాములు పాల్గొనగా 11వ డివిజన్ కార్పొరేటర్ సుధమల హరికృష్ణ ఆధ్వర్యంలో ఈ గ్రామసభను నిర్వహించారు .ఈ సందర్భంగా మేయర్ ధర్ని మధుకర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని , వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మున్సిపల్ ఆటో ట్రాలీ చెత్త బండి వచ్చే సమయంలో తప్పనిసరిగా చెత్తను అందజేయాలని, తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఏఎస్పీ ప్రకాష్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. రోడ్లపై పశువులను వదలకూడదని, అలా వదలడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాగే తల్లిదండ్రులు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, అలా ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ ప్రమోద్ రావు, ఎస్సై తిరుపతి, వార్డు ఆఫీసర్ రాములు, హౌసింగ్ బోర్డ్ ఏఈ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఎంపీ గడ్డం వంశీకృష్ణ కృషితో మంచిర్యాల ప్రాంతానికి భారీ వరం

### ఎన్ ఎచ్ -63 నాలుగు లేన్ల విస్తరణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

### కేంద్ర క్యాబినెట్ ఆమోదం పట్ల ఎంపీ గడ్డం వంశీకృష్ణ హర్షం

**మంచిర్యాల, 4, జూన్ (ప్రజాజ్యోతి):** పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని మంచిర్యాల జిల్లాకు కేంద్ర ప్రభుత్వం కీలక అభివృద్ధి వరం అందించింది. ఆర్మూర్--జగిత్యాల--మంచిర్యాల జాతీయ రహదారి (ఎన్ ఎచ్ -63)ను నాలుగు లేన్లుగా విస్తరించే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం వెనుక ఎంపీ గడ్డం వంశీకృష్ణ నిరంతర కృషి, పార్లమెంట్ స్థాయిలో చేసిన పలు విజ్ఞప్తులు ముఖ్య పాత్ర పోషించాయి. ఈ రహదారి విస్తరణతో ఉత్తర తెలంగాణలో రవాణా వ్యవస్థ మరింత బలపడనుంది. ముఖ్యంగా మంచిర్యాల, లక్సెట్టిపేట, జైపూర్, చెన్నూరు ప్రాంతాల ప్రజలకు మెరుగైన రోడ్డు సౌకర్యాలు అందనున్నాయి. ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్ ఒత్తిడి తగ్గడంతో పాటు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. పరిశ్రమల అభివృద్ధికి కీలకంగా మారనున్న ఈ ప్రాజెక్టు ద్వారా సింగరేణి, ఎన్టీపీసీ వంటి పెద్ద పరిశ్రమలకు సరకు రవాణా మరింత వేగవంతం కానుంది. దీంతో ప్రాంతీయ ఆర్థిక కార్యకలాపాలు కూడా మరింత చురుకుగా మారనున్నాయి. గత కొంతకాలంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ పార్లమెంట్ వేదికగా ఈ రహదారి విస్తరణ అవసరాన్ని గట్టిగా ప్రస్తావిస్తూ వచ్చారు.




కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లి, పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలు, పారిశ్రామిక అవసరాలు, ప్రజల రవాణా సౌకర్యాలను వివరించారు. ఈ క్రమంలోనే ప్రాజెక్టుకు ఆమోదం లభించడం ప్రాంత ప్రజల్లో ఆనందాన్ని కలిగించింది. ఈ నాలుగు లేన్ల రహదారి పూర్తయిన తర్వాత మంచిర్యాల జిల్లా తెలంగాణలోని ప్రధాన పారిశ్రామిక, వాణిజ్య కేంద్రాలతో మరింత బలమైన అనుసంధానాన్ని పొందనుంది. దీంతో ప్రాంత అభివృద్ధికి కొత్త దిశ లభించనుందని అధికారులు, ప్రజాప్రతినిధులు భావిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల తగ్గుదలకు కూడా ఇది దోహదపడుతుందని అంచనా. కేంద్ర క్యాబినెట్ ఆమోదంపై ఎంపీ గడ్డం వంశీకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు అమలుతో మంచిర్యాల జిల్లా అభివృద్ధి వేగవంతమవుతుందని ఆయన గురువారం తెలిపారు. ప్రజల అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో మరిన్ని అభివృద్ధి పనులు తీసుకురావడానికి తన ప్రయత్నాలు కొనసాగుతాయని ఎం పి అన్నారు.

## మహిళల ఆరోగ్య రక్షణకు పీహెచ్‌సీ ముందడుగు



**మంచిర్యాలరూరల్ జూన్04(ప్రజాజ్యోతి)** మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షల కార్యక్రమాన్ని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.సుధాకర్ నాయక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలకు 33 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించనున్నారు. రోజుకు 50 మంది మహిళలకు వైద్య పరీక్షలు,మందుల పంపిణీతో పాటు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వడదెబ్బ నివారణ,అసంక్రమణ వ్యాధుల నియంత్రణ, బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

## సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వ్యక్తిగత సమాచారం ఎవరికీ చెప్పొద్దు: అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్

అవగాహన కరపత్రాలు విడుదల



**ఆసిఫాబాద్ జూన్ 4 ప్రజా జ్యోతి** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సమాచార హక్కు రక్షణ చట్టం-2005 సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన అవగాహన కరపత్రాలను అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ విడుదల చేశారు. సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల నివారణ, రోడ్ సేఫ్టీ నియమాలు, భారత రాజ్యాంగ పీఠిక, ప్లాస్టిక్ నివారణ, అడవుల సంరక్షణ, సమాచార హక్కు చట్టంపై రూపొందించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రజలు సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, వ్యక్తిగత సమాచారం, ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఎవరికీ తెలపవద్దని సూచించారు. యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఉన్నతంగా చదువుకొని లక్ష్యాలను చేరుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమాచార హక్కు రక్షణ చట్టం సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. కొండగుర్ల కమలాకర్, జిల్లా అధ్యక్షుడు వంగరి ప్రవీణ్, సలహాదారు రామ్టెంకి కృష్ణ, కోశాధికారి గజ్జల తిరుపతి, మీడియా కన్వీనర్ తిరుపతి, ఆసిఫాబాద్ డివిజన్ అధ్యక్షుడు రవిదాస్, కాగజ్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు మాదాసు నాగేష్, జిల్లా కమిటీ సభ్యుడు కుమ్మరి లింగయ్య, మండలాల అధ్యక్షులు కడారి శ్రీనివాస్, వీరాచారి, జాడి బాపురావు, దుర్గం భీమ్‌రావు, నైతం కిరణ్, హార్థిక్, సభ్యులు దామోదర్, సురేష్, సంతోష్, గగన్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

## దస్నాపూర్ అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ

**ఆర్థిక సాయం అందజేసిన డీసీసీ అధ్యక్షురాలు సుగుణక్క**

**ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు కృషి చేస్తామని హామీ**



**ఆసిఫాబాద్ జూన్ 4 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ పట్టణం దస్నాపూర్‌లో బుధవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన కుటుంబాలను డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క గురువారం పరామర్శించారు. కాలిపోయిన ఇళ్లను పరిశీలించి బాధితులను ఓదార్చారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. తన వంతుగా బాధితులకు ఆర్థిక సహాయం అందజేశారు. బాధితులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ప్రత్యేకంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన సహాయ సహకారాలు త్వరగా అందేలా అధికారులతో మాట్లాడతామని పేర్కొన్నారు. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ ప్రజల వెంటే ఉంటుందని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ ఇరుకుల మంగ, డీసీసీ ఉపాధ్యక్షుడు తరిఖ్, డైరెక్టర్ మారుతి పటేల్, కౌన్సిలర్ వైరాగడే గోవింద్, మాజీ ఎంపీటీసీ సిడాం తిరుపతి, కాంగ్రెస్ నాయకులు ఇల్లూరి రాము, మెంగ్రే మోహన్, హరికృష్ణ, వైరాగడే సాయి, మర్రి బాలు, జాడి ప్రసాద్, జాడి తిరుపతి, యూత్ కాంగ్రెస్ ఎలగలా సాయి, కమలనాథ్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శ్రీకాంత్, గేడం శ్రీధర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## వార్డు సభలో ప్రజలే కేంద్రబిందువు



**మంచిర్యాలరూరల్‌జూన్04(ప్రజాజ్యోతి)**మంచిర్యాల నగరంలోని పాత మంచిర్యాల 14వ డివిజన్‌లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వార్డు ముగింపు సభ ఉత్సాహభరితంగా జరిగింది. 14 డివిజన్ కార్పొరేటర్ తూముల నరేష్ అధ్యక్షతన ఆయన నివాసంలో నిర్వహించిన సమావేశానికి ఎస్సై మధుసూదన్, వార్డు ఆఫీసర్ తిరుపతి స్థానిక ప్రజలు, మహిళలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు. సభలో డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజాస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలు రాబోయే రోజుల్లో అమలు చేయనున్న కార్యక్రమాలపై చర్చించారు. ప్రజలు తమ సమస్యలు, అవసరాలు, సూచనలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈసందర్భంగా ఎస్సై మధుసూదన్ మాట్లాడుతూ యువత సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని కోరారు. కార్పొరేటర్ తూముల నరేష్ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే వార్డు అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పరిశుభ్రమైన పరిసరాల కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రజల సూచనలను పరిగణనలోకి తీసుకుని డివిజన్ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని పేర్కొన్నారు.

# విశ్వకర్మ మహాసభ జిల్లా జాయింట్ సెక్రటరీగా బ్రహ్మశ్రీ పాలిక కుమార్ చారి నియామకం

**సమాజ అభివృద్ధికి కొత్త ఊపిరి**



**మంచిర్యాల ప్రతినిధి జూన్ 4 ప్రజా జ్యోతి** విశ్వకర్మ సమాజానికి గత 20 సంవత్సరాలుగా నిరంతర సేవలందిస్తూ, సామాజిక, సాంస్కృతిక, సంఘటిత కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తున్న బ్రహ్మశ్రీ పాలిక కుమార్ చారిని అఖిల్ భారతీయ విశ్వకర్మ మహాసభ జిల్లా జాయింట్ సెక్రటరీగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు నౌండ్ల సంతోష్ చారి అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. సంఘటిత శక్తిని పెంపొందించడం, విశ్వకర్మ బంధువుల సమస్యలకు పరిష్కార మార్గాలు చూపించడం, యువతను సంఘ కార్యకలాపాల్లో భాగస్వామ్యం చేయడం వంటి లక్ష్యాలతో సంస్థ తీసుకున్న ఈ నిర్ణయం సమాజంలో హర్షం వ్యక్తమవుతోంది. అనేక సంవత్సరాలుగా పాలిక కుమార్ చారి గారు విశ్వకర్మ సమాజ అభివృద్ధి కోసం వివిధ ప్రాంతాల్లో చేపట్టిన సేవా కార్యక్రమాలు, నాయకత్వ లక్షణాలు, సమన్వయ సామర్థ్యం గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు సంస్థ వర్గాలు తెలిపాయి. జిల్లా జాయింట్ సెక్రటరీగా ఆయన నియామకం కావడంతో విశ్వకర్మ మహాసభ కార్యకలాపాలు మరింత బలోపేతం అవుతాయని, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సంఘటిత నిర్మాణం మరింత చురుకుగా మారుతుందని సమాజ పెద్దలు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా యువతను సంఘంలోకి తీసుకురావడం, విద్యా, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడం, అవసరమైన కుటుంబాలకు సహాయ సహకారాలు అందించడం వంటి కార్యక్రమాలకు ఈ నియామకం కొత్త దిశను ఇస్తుందని ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ పాలిక కుమార్ చారి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు నౌండ్ల సంతోష్ చారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సమాజ సేవే తన జీవిత లక్ష్యమని పేర్కొన్న

ఆయన, విశ్వకర్మ బంధువుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని, సమాజంలోని ప్రతి వర్గాన్ని కలుపుకుంటూ ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. సంఘటితంగా బలమైన సమాజ నిర్మాణం, యువతలో నాయకత్వ లక్షణాల పెంపు, మరియు సామాజిక అభ్యున్నతే లక్ష్యంగా తన పాత్రను మరింత సమర్థవంతంగా నిర్వర్తిస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ నియామకంతో జిల్లా స్థాయిలో విశ్వకర్మ మహాసభకు కొత్త ఉత్సాహం, కొత్త దిశ లభించిందని, సమాజ అభివృద్ధికి ఇది ఒక కీలక మలుపు అవుతుందని విశ్వకర్మ బంధువులు అభిప్రాయపడుతున్నారు.

# కవ్వాల్ అటవీ ప్రాంతం ప్రకృతి ప్రసాదించిన అమ్యూల్య సంపద.

**ఎఫ్ డి వో రామ్మోహన్**



**జన్నారం, జూన్4 (ప్రజాజ్యోతి)**కవ్వాల్ టైగర్ జోన్ తెలంగాణ ప్రాంతంకు పకృతి ప్రసాదించిన అమూల్య సంపదని జన్నారం ఎఫ్.డి.వో రామ్మోహన్ అన్నారు. ప్రజా పాలన ప్రణాళిక కార్యక్రమంలో బాగంగా వనదర్శని పేరుతో మంచిర్యాల జిల్లా కవ్వాల్ టైగర్ జోన్ లోని జన్నారం , తాళ్లపేట రేంజ్ లలో జన్నారం, దండేపల్లి మండలాల విలేకరులను సఫారి వాహనం ద్వారా అడవిలోకి తీసుకవెళ్లి అడవిలో చేపడుతున్న అభివృద్ధి పనులు, వన్యప్రాణుల సంరక్షణ కోసం తీసుకుంటన్న చర్యలను వివరించారు. అనంతరం బైసన్ కుంట వద్ద మాట్లాడుతూ కవ్వాల్ టైగర్ జోన్ కు దేశంలోనే ప్రత్యేక జీవవైవిధ్య కేంద్రంగా గుర్తింపుందని పులులు, చిరుతలు, ఎలుగుబంట్లు, జింకలు, అడవి దున్నలు, అడవి కుక్కలతో పాటు అనేక వన్యప్రాణులకు ఆవాసంగా నిలుస్తుందన్నారు. కవ్వాల్ టైగర్ జోన్ జంతువులకే కాకుండా పక్షి ప్రేమికులకు స్వర్గధామమని 300 లకు పైగా పక్షిజాతులు ఇక్కడ ఉన్నాయని శీతాకాలంలో హిమలయ ప్రాంతాల నుంచి వలస పక్షులు ఇక్కడి చేరుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. అడవి జంతువులు, పక్షులు, మానవులు పకృతి వ్యవస్థలో విడదీయరాని బందమని పక్షులు విత్తనాల వ్యాప్తికి, అడవి పునరుత్పత్తికి దోహదపడతాయని జంతువులు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రతి జీవికి పకృతిలో ఒక ప్రత్యేక స్థానం ఉందని వాటి సంరక్షణ కోసం ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవలని కోరారు. కార్యక్రమంలో భాగంగా తాళ్లపేట రేంజ్ బైసన్ కుంట వద్ద వన్యప్రాణుల అవాసలు, వాటి కోసం ఏర్పాటు చేసిన నీటి కుంటలను విలేకరులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇందన్ పెల్లి, జన్నారం రేంజ్ ఆఫీసర్లు లక్ష్మీనారయణ, బాబా ఖాదర్ వలి, డీఆర్వోలు, సెక్షన్, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# నేడు (జూన్ 5) ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**సింగరేణి అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ అవసరం**




**మంచిర్యాల , 4 జూన్ (ప్రజాజ్యోతి)** ;నేడు (జూన్ 5) ప్రపంచ పర్యావరణ దినోత్సవం. జూన్, 5న జరుపుకునే ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణ అంశంపై చర్చ జరుగుతున్న వేళ సింగరేణి సంస్థ పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. తెలంగాణ ఆర్థికాభివృద్ధికి దశాబ్దాలుగా కీలకంగా నిలుస్తున్న సింగరేణి కాలరీస్ కంపెనీ దేశ విద్యుత్ రంగానికి అవసరమైన బొగ్గును నిరంతరం సరఫరా చేస్తోంది. బొగ్గు ఉత్పత్తి ఎంత అవసరమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే కీలక బాధ్యతగా మారిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా భూగర్భ గనుల్లో పర్యావరణ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని అని అంటున్నారు. భూగర్భ గనుల్లో గాలి నాణ్యత ప్రధాన సమస్యగా నిలుస్తోంది. బొగ్గు తవ్వకాల సమయంలో వెలువడే ధూళి, మీథేన్ వాయువులు కార్మికుల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున సమర్థవంతమైన వెంటిలేషన్ వ్యవస్థలు, ధూళి నియంత్రణ చర్యలు, నిరంతర గాలి నాణ్యత పర్యవేక్షణ అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ఈ దిశగా సింగరేణి సంస్థ అనేక గనుల్లో ఆధునిక వెంటిలేషన్ వ్యవస్థలను ఏర్పాటు చేసి సురక్షిత పని వాతావరణాన్ని కల్పిస్తోంది. నీటి నిర్వహణ కూడా మరో కీలక అంశంగా నిలుస్తోంది. గనుల్లోకి చేరే నీటిని నియంత్రిత విధానంలో బయటకు పంపిస్తూ, శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలు, వ్యవసాయం మరియు స్థానిక అవసరాలకు వినియోగించడం ద్వారా నీటి సంరక్షణకు తోడ్పడవచ్చని పేర్కొంటున్నారు. భూగర్భ గనుల్లో భూమి కుంగిపోవడం వంటి సమస్యలను తగ్గించేందుకు శాస్త్రీయ మైనింగ్ పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, నిరంతర భౌగోళిక పరిశీలనలు అవసరమని అధికారులు సూచిస్తున్నారు. నివాస ప్రాంతాలు, వ్యవసాయ భూములు ప్రభావితం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం సంస్థ బాధ్యతగా భావిస్తున్నారు. ఓపెన్‌కాస్ట్ గనులతో పోలిస్తే భూగర్భ గనులు పర్యావరణ పరంగా కొంత అనుకూలంగా ఉంటాయని, అడవుల నరికివేత తక్కువగా ఉండడం, భూమి ఉపరితల ప్రభావం పరిమితంగా ఉండడం వంటి ప్రయోజనాలు ఉన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. అందువల్ల భవిష్యత్తులో ఆధునిక, యాంత్రీకృత భూగర్భ గనుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తున్నారు. గనుల పరిసర ప్రాంతాల్లో హరితహారం పెంపకం, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, సౌర విద్యుత్ వినియోగం వంటి కార్యక్రమాలు పర్యావరణ సమతుల్యతకు తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు. ఖాళీ గనుల భూములను పచ్చని ప్రాంతాలుగా మార్చడం ద్వారా ప్రకృతికి పునరుజ్జీవనం కల్పించవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కేవలం సంస్థల బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి ఉద్యోగి, కార్మికుడు, అధికారి, స్థానిక ప్రజల సమిష్టి బాధ్యత అని నిపుణులు సూచిస్తున్నారు. కాలుష్య నియంత్రణ, నీటి సంరక్షణ, మొక్కల పెంపకం వంటి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నేటి ప్రపంచం వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఉత్పత్తి లక్ష్యాలతో పాటు పర్యావరణ పరిరక్షణను సమానంగా పరిగణించాల్సిన అవసరం ఉందని సామాజిక విశ్లేషకులు ఆళవందార్ వేణు మాధవ్ పేర్కొన్నారు. "బొగ్గు ఉత్పత్తి -- పర్యావరణ సంరక్షణ -- భవిష్యత్ తరాల భద్రత" అనే త్రిసూత్రాన్ని అనుసరించినప్పుడే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అన్నారు.ప్రతి ఉద్యోగి ఒక మొక్క నాటి ప్రకృతిని కాపాడేందుకు సంకల్పం చేయాలని, అదే భావితరాలకు అందించే గొప్ప బహుమతిగా నిలుస్తుందని ఆయన సూచించారు.

# గ్రామసభ సమాచారం ఇవ్వకుంటే ఎలా..?

**సరండి గ్రామస్థుల ఆగ్రహం**
**కొందరికే చెప్పారని ఆరోపణ,**
**పారదర్శకత పాటించాలని డిమాండ్**

**ఆసిఫాబాద్ జూన్ 4 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సరండి గ్రామపంచాయతీలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన గ్రామసభ సమాచారాన్ని గ్రామంలోని అందరికీ చేరవేయలేదని, కేవలం కొంతమందికే తెలియజేశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీంతో గ్రామసభ నిర్వహణ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.గ్రామ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక వంటి కీలక అంశాలపై చర్చించే గ్రామసభకు ప్రతి కుటుంబానికి సమాచారం చేరేలా చూడటం పంచాయతీ అధికారుల ప్రాథమిక బాధ్యత. అయితే నూతన కార్యదర్శి డప్పు చాటింపు, మైక్ ప్రకటనలు, వార్డు సభ్యుల ద్వారా సమాచారం పంపకుండా పరిమిత స్థాయిలోనే తెలిపారని పలువురు వాపోతున్నారు.దీంతో పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, అర్హులైన లబ్ధిదారులు సమావేశానికి హాజరుకాలేకపోయామని, తమ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పథకాల ఎంపికలో ఇప్పటికే పారదర్శకతపై అనుమానాలు ఉన్న నేపథ్యంలో గ్రామసభ సమాచారం కూడా అందరికీ చేరకపోవడం ఆందోళన కలిగిస్తోందని అంటున్నారు.భవిష్యత్తులో గ్రామసభ తేదీ, సమయం, స్థలం వివరాలను కొన్ని రోజుల ముందే గ్రామమంతటా ప్రచారం చేయాలని,



హాజరు వివరాలు, చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో సమాచార లోపాలు ఉంటే ప్రజాపాలన లక్ష్యం నెరవేరదని, ఉన్నతాధికారులు దృష్టి సారించి పారదర్శకత పాటించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.గ్రామసభలు నిజమైన ప్రజాస్వామ్య వేదికలుగా నిలవాలంటే సమాచారం అందరికీ చేరడం, ప్రతి గ్రామస్థుడికి పాల్గొనే అవకాశం కల్పించడం అవసరమని స్థానికులు పేర్కొంటున్నారు.

## రామగుండం కమిషనరేట్‌లో 14 మంది ఎస్సైల బదిలీ

**ఐదు పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు సీఎస్‌బీకి**




**మంచిర్యాల , 4 జూన్ (ప్రజాజ్యోతి)** ;రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 14 మంది సబ్ ఇన్‌స్పెక్టర్ల (ఎస్సై) బదిలీలు చోటుచేసుకున్నాయి. పరిపాలనా అవసరాల దృష్ట్యా పలువురు ఎస్‌హెచ్‌వోలు, సిబ్బందిని వివిధ విభాగాలకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కన్నెపల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో కె. భాస్కర్‌రావు, మంథని ఎస్‌హెచ్‌వో దగాల రమేష్, పెద్దపల్లి ఎస్‌హెచ్‌వో జె. లక్ష్మణ్‌రావు, పోత్కపల్లి ఎస్‌హెచ్‌వో దీకొండ రమేష్, బెల్లంపల్లి–2 టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో చి. కిరణ్‌కుమార్‌లను రామగుండం కమిషనరేట్ క్రైమ్ స్పెషల్ బ్రాంచ్ (సీఎస్‌బీ)కు బదిలీ చేశారు. అదేవిధంగా సీఎస్‌బీలో విధులు నిర్వహిస్తున్న కె. రాణి, ఎ. రాజమణి, బి. శరణ్య, వి. హైమ, కె. మౌనికలను వీఆర్ (వేకెంట్ రిజర్వ్)కు బదిలీ చేశారు. మరోవైపు కొటాల పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో డి. చంద్రశేఖర్‌ను కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్ (డీఎస్‌బీ)కు, ఈజ్‌గావ్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఇస్లావత్ నరేష్‌ను కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (డీసీఆర్‌బీ)కు బదిలీ చేశారు. కాళేశ్వరం ఎస్‌హెచ్‌వో జి. తమాషా రెడ్డిని జయశంకర్ భూపాలపల్లి జిల్లా డీఎస్‌బీకి, ములుగు ఎస్‌హెచ్‌వో యు. ఉపేందర్‌రావును ములుగు జిల్లా డీఎస్‌బీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని పోలీసు శాఖ వర్గాలు వెల్లడించాయి. కమిషనరేట్ పరిధిలో పరిపాలనా పటిష్టత, విధుల సమర్థ నిర్వహణ లక్ష్యంగా ఈ బదిలీలు చేపట్టినట్లు సమాచారం.

## ప్రీ ప్రైమరీ తరగతుల బోధనకు దరఖాస్తుల స్వీకరణ: ఎంఈఓ విజయ్ కుమార్

**జన్నారం,జూన్4(ప్రజాజ్యోతి)** ప్రీ ప్రైమరీ తరగతులు బోధించేందుకు ఆసక్తి గల మహిళా అభ్యర్థుల నుండి ఇన్స్ట్రక్టర్స్ మరియు ఆయాల నియామకం కోసం దరఖాస్తులు చేసుకోవాలని మండల విద్యాధికారి నడిమెట్ల విజయ్ కుమార్ తెలిపారు.ఎంపీపీఎస్ కామన్ పెల్లి, బాదంపెల్లి,ఎంపి యుపిఎస్ రెండ్లగూడ,ఇందనపల్లి పాఠశాలలో బోధించుటకు ఇన్స్ట్రక్టర్స్ (మహిళలు)ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించి,డిఎడ్ చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని ,ఆయా లు (మహిళలు)ఏడవ తరగతి లో ఉత్తీర్ణులై ఉండాలని అన్నారు.వయోపరిమితి 18 నుండి 44 సంవత్సరాలు బీసీ,ఎస్సీ,ఎస్టీ,ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 సంవత్సరాల వయోపరిమితి సడలింపు ఉందని అన్నారు. దరఖాస్తుదారులు సంబంధిత పాఠశాల పరిధిలోని హాబిటేషన్ గ్రామపంచాయతీకి చెందిన వారై ఉండాలని,వారికే మొదటి ప్రాధాన్యత ఇస్తామని,దరఖాస్తుతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లు, నివాస ధ్రువపత్రం, ఆధార్ కార్డు జతపరచాలని,దరఖాస్తు సమర్పించే సమయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లు చూపించాలని కోరారు.పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 8వ తేదీలోగా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేయాలన్నారు.

# తెలంగాణపై జరిగిన వివక్షకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో ఆయన నిర్భయంగా పాల్గొన్న ఉద్యమకారుడు గజెల్లి వెంకన్న


## సామాజిక ఉద్యమకారుడు గజెల్లి వెంకటయ్యకు ఘనంగా ఆత్మీయ సన్మానం



**మంచిర్యాల, 4, జూన్ (ప్రజాజ్యోతి):** తెలంగాణపై జరిగిన వివక్షకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో ఆయన నిర్భయంగా పాల్గొన్న ఉద్యమకారుడు గజెల్లి వెంకన్న అని వక్తలు కొనియాడారు .తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని 51వ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీ నివాసి, సామాజిక ఉద్యమకారుడు, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, బీసీ సంఘాల నాయకుడు గజెల్లి వెంకటయ్యకు ఆయన ఆత్మీయ మిత్రులు, సింగరేణి విశ్రాంత ఉద్యోగులు గురువారం ఘనంగా ఆత్మీయ సన్మానం చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గజెల్లి వెంకటయ్యను పూల బొకేతో సత్కరించి, శాలువా కప్పి గౌరవించారు. నిరుపేదలు, వయోవృద్ధులు, వికలాంగులు, అంధులు మరియు అనాథ ఆశ్రమాల్లో అన్నదానం, వస్త్రదానం వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజ సేవలో విశేషంగా కృషి చేస్తున్న వెంకటయ్య సేవలను ఈ సందర్భంగా ఆత్మీయులు కొనియాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గజెల్లి వెంకటయ్య 2001 నుండి 2014 వరకు బెల్లంపల్లి ప్రాంతంలో తెలంగాణ పొలిటికల్ జాక్ కన్వీనర్‌గా, 29 కుల సంఘాలకు నాయకత్వం వహిస్తూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. సీమాంధ్ర వలస పెట్టుబడిదారుల విధానాలు, తెలంగాణపై జరిగిన వివక్షకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో ఆయన నిర్భయంగా పాల్గొని, అరెస్టులు, పోలీస్ కేసులు ఎదురైనా వెనుకడుగు వేయలేదని తెలిపారు. అలాగే సింగరేణి విశ్రాంత ఉద్యోగుల హక్కుల కోసం, సహారా బాధితులకు అండగా నిలుస్తూ ఆయన చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగించాలని, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం, సామాజిక తెలంగాణ సాధన కోసం పోరాటాన్ని కొనసాగించాలని ఆత్మీయులు కోరారు. సన్మాన గ్రహీత గజెల్లి వెంకటయ్య మాట్లాడుతూ, తన ఆత్మీయ మిత్రులు, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు తనను గౌరవించడం పట్ల సంతోషం, ఆనందం వ్యక్తం చేశారు. తాను చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి సన్మానించిన అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు రాళ్ళబండి రాజన్న ,నిచ్చకోళ్ల అంజయ్య, జిమ్ నిర్వాహకుడు జెట్టి మురహరి రావు, పులి కృష్ణ, పి. నారాయణ, ఎస్. రమేష్, రసకట్ల రాజయ్య, ఏ. కొమురయ్య, కస్తూరి సూర్యం, ఏ. గంగయ్య, రామ్‌లాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్నవారు "జై తెలంగాణ", "జోహార్ తెలంగాణ అమర వీరులకు", "సింగరేణి విశ్రాంత ఉద్యోగుల ఐక్యత వర్ధిల్లాలి", "పోరాడుదాం సామాజిక తెలంగాణ కోసం" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

# కోల్ ఇండియా లిమిటెడ్‌లో కీలక వ్యాధుల చికిత్స కోసం "తత్కాల్/అడ్హాక్ రీయింబర్స్‌మెంట్ సిస్టమ్"ను వెంటనే ప్రవేశపెట్టాలి

**అఖిల భారత బొగ్గు కార్యనిర్వాహకుల సంఘం (ఏఐఏసిఇ ) ప్రధాన కార్యదర్శి పీ. కె. సింగ్ రాథోడ్**



AIACE ప్రధాన కార్యదర్శి పీ. కె. సింగ్ రాథోడ్ కోల్ ఇండియా యాజమాన్యాన్ని కోరారు

కీలక వ్యాధుల చికిత్సకు తత్కాల్ వైద్య రీయింబర్స్‌మెంట్ విధానం అమలు చేయాలి

రిటైర్డ్ ఉద్యోగులకు తక్షణ ఆర్థిక సహాయం తప్పనిసరి – ఆసుపత్రులకు అడ్వాన్స్, ఫాస్ట్ ట్రాక్ క్లియరెన్స్ ప్రతిపాదన

మంచిర్యాల, జూన్ 4 (ప్రజా జ్యోతి): కోల్ ఇండియా లిమిటెడ్‌లో అమలులో ఉన్న CPRMSE మరియు CPRMS-NE వైద్య రీయింబర్స్‌మెంట్ పథకాల కింద కీలక వ్యాధుల చికిత్స కోసం "తత్కాల్/అడిoక్ రీయింబర్స్‌మెంట్ సిస్టమ్"ను ప్రవేశపెట్టాలని భారత బొగ్గు కార్యనిర్వాహకుల సంఘం (AIACE) ప్రధాన కార్యదర్శి పీ. కే. సింగ్ రాథోడ్ కోల్ ఇండియా యాజమాన్యాన్ని కోరారు.

ఈ మేరకు ఆయన కోల్ ఇండియా చైర్మన్-కమ్-మేనేజింగ్ డైరెక్టర్‌కు లేఖ రాశారు. ప్రస్తుతం అమలులో ఉన్న పథకం ఉన్నప్పటికీ క్లెయిమ్‌ల సెటిల్‌మెంట్‌లో జరుగుతున్న ఆలస్యాల కారణంగా రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్స్ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.



పీ. కె. సింగ్ రాథోడ్
ప్రిన్సిపల్ జనరల్ సెక్రటరీ, AIACE

**కీలక వ్యాధులకు పరిమితి తొలగింపు**
గుండె సంబంధిత శస్త్రచికిత్సలు, క్యాన్సర్, కిడ్నీ వ్యాధులు, పక్షవాతం, హెచ్ఐవీ ఎయిడ్స్ అడిసన్స్ డిసీజ్ వంటి ప్రాణాంతక వ్యాధులకు జీవితకాల రీయింబర్స్‌మెంట్ పరిమితిని తొలగించడం ఒక కీలక సంక్షేమ చర్య.

**1. తత్కాల్ అడిoక్ విడుదల**
హాస్పిటలైజేషన్ రికార్డులు, అంచనాలు, డిశ్చార్జ్ సమరీ, ప్రిస్క్రిప్షన్లు, ప్రాథమిక బిల్లులు సమర్పించిన వెంటనే, అర్హత కలిగిన క్లెయిమ్‌లో 70% నుంచి 90% వరకు అడిoక్ చెల్లింపును 7 నుంచి 15 రోజుల్లో విడుదల చేయాలి.

**2. తుది ఆడిట్, సర్దుబాటు**
క్లెయిమ్‌ను తరువాత నియమాల ప్రకారం సమగ్రంగా పరిశీలించి ఆడిట్ చేయాలి. తుది సెటిల్‌మెంట్ సమయంలో అధికంగా చెల్లించిన లేదా తక్కువగా చెల్లించిన మొత్తాన్ని సర్దుబాటు చేయాలి.

**3. నిరంతర చికిత్సకు సహాయం**
దీర్ఘకాలిక చికిత్స కొనసాగుతున్న సమయంలో (మందులు, డయాలసిస్, కీమోథెరపీ, ఫాలో-అప్, ఇంప్లాంట్లు, స్టెంట్లు మొదలైనవి) అదనపు అవసరాలకు కూడా అవసరమైనంతవరకూ అడిoక్ సాయాన్ని కొనసాగించాలి.

**4. ఆసుపత్రులకు అత్యవసర అడ్వాన్స్**
ప్రధాన శస్త్రచికిత్సలు, యాంజియోప్లాస్టీ, CABG, పేస్‌మేకర్ ఇంప్లాంటేషన్, క్యాన్సర్ చికిత్స, అవయవ సంబంధిత థెరపీలు వంటి సందర్భాల్లో ఆసుపత్రులకు నేరుగా అడ్వాన్స్ చెల్లించే విధానం ఏర్పాటు చేయాలి.

**5. ఫాస్ట్ ట్రాక్, సమయపాలిత పరిష్కారం**
పరిమితి లేకుండా రీయింబర్స్‌మెంట్ వర్తించే వ్యాధుల క్లెయిమ్‌లను ప్రత్యేక ఫాస్ట్-ట్రాక్ విధానంలో ప్రాధాన్యతతో మరియు సమయపాలితంగా పరిష్కరించాలి.

ఈ విధానం ద్వారా సంస్థపై అదనపు ఆర్థిక భారం పడదని, ఇప్పటికే అర్హత ఉన్న రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని ముందుగానే విడుదల చేసే వ్యవస్థ మాత్రమేనని AIACE స్పష్టం చేసింది.

కోల్ ఇండియా వంటి సంక్షేమ దృష్టి కలిగిన సంస్థ ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించి వెంటనే అమలు చేయాలని, పీ. కె. సింగ్ రాథోడ్ విజ్ఞప్తి చేశారు.

ప్రతిలిపి: 1. CMD, SCCL – ఇదే విధమైన అభ్యర్థనతో 2. బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి, భారత ప్రభుత్వం, న్యూఢిల్లీ.

ప్రతిలిపి: గౌరవనీయ బొగ్గు మంత్రి,, భారత ప్రభుత్వం, న్యూఢిల్లీ – సమాచారం కోసం మరియు సంబంధిత అధికారులకు తగిన ఆదేశాల కోసం.

**మంచిర్యాల, జూన్ 4 (ప్రజా జ్యోతి):** కోల్ ఇండియా లిమిటెడ్‌లో అమలులో ఉన్న సిపిఆర్ఎంఎస్–ఇ(మాజీ అధికారులకు) అలాగే సిపిఆర్ఎంఎస్–ఎన్ఇ(మాజీ ఉద్యోగులకు) వైద్య రీయింబర్స్‌మెంట్ పథకాల కింద కీలక వ్యాధుల చికిత్స కోసం "తత్కాల్/అడ్హాక్ రీయింబర్స్‌మెంట్ సిస్టమ్"ను వెంటనే ప్రవేశపెట్టాలని అఖిల భారత బొగ్గు కార్యనిర్వాహకుల సంఘం (ఏఐఏసి) ప్రధాన కార్యదర్శి పీ. కె. సింగ్ రాథోడ్ కోరారు. ఈ మేరకు ఆయన కోల్ ఇండియా లిమిటెడ్ చైర్మన్–కమ్–మేనేజింగ్ డైరెక్టర్‌కు గురువారం అధికారిక లేఖ రాశారు. కోల్ ఇండియా లిమిటెడ్‌లో రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్స్‌కు సంబంధించిన సిపిఆర్ఎంఎస్–ఇ(మాజీ అధికారులకు) అలాగే సిపిఆర్ఎంఎస్–ఎన్ఇ(మాజీ ఉద్యోగులకు) వైద్య రీయింబర్స్‌మెంట్ పథకాల కింద కీలక వ్యాధుల చికిత్స కోసం తత్కాల్/అడ్హాక్ రీయింబర్స్‌మెంట్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని అఖిల భారత బొగ్గు కార్యనిర్వాహకుల సంఘం ప్రధాన కార్యదర్శి పీ. కె. సింగ్ రాథోర్ కోరారు. ఈ మేరకు ఆయన కోల్ ఇండియా చైర్మన్–కమ్–మేనేజింగ్ డైరెక్టర్‌కు లేఖ రాశారు. క్యాన్సర్, గుండె సంబంధిత శస్త్రచికిత్సలు, కిడ్నీ వ్యాధులు, పక్షవాతం, హెచ్ఐవీ/ఎయిడ్స్, అడిసన్స్ డిసీజ్ వంటి ప్రాణాంతక వ్యాధులకు సంబంధించి ఇప్పటికే జీవితకాల రీయింబర్స్‌మెంట్ పరిమితిని తొలగించినప్పటికీ, క్లెయిమ్‌ల సెటిల్‌మెంట్ ఆలస్యంతో లబ్ధిదారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని లేఖలో పేర్కొన్నారు. ఆసుపత్రుల్లో ముందస్తు చెల్లింపులు, మందులు, డయాలసిస్, కీమోథెరపీ వంటి చికిత్సలకు భారీ ఖర్చులు భరించాల్సి వస్తోందని ఆయన తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు 70% నుంచి 90% వరకు అడ్వాక్ మొత్తాన్ని 7 నుంచి 15 రోజుల్లో విడుదల చేసే విధంగా తత్కాల్ వైద్య సహాయ పద్ధతి ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అలాగే ఆసుపత్రులకు అత్యవసర అడ్వాన్స్ చెల్లింపులు, ప్రత్యేక ఫాస్ట్–ట్రాక్ క్లియరెన్స్ వ్యవస్థను అమలు చేయాలని సూచించారు. ఈ విధానం ద్వారా సంస్థపై అదనపు ఆర్థిక భారం పడదని, ఇప్పటికే అర్హత ఉన్న రీయింబర్స్‌మెంట్‌ను ముందుగానే అందించే వ్యవస్థ మాత్రమే అవుతుందని ఆయన వివరించారు. ఇది రిటైర్డ్ ఉద్యోగులు మరియు వారి కుటుంబాలకు వైద్య అత్యవసర పరిస్థితుల్లో పెద్ద ఉపశమనం కలిగిస్తుందని తెలిపారు. కోల్ ఇండియా వంటి సంస్థలు సంక్షేమ దృష్టితో ముందుండాలని, ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# బాధితులకు నేనున్నా: మాజీ ఎమ్మెల్యే సక్కు లైబ్రరీ చైర్మన్ అనిల్ భరోసా

**ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించడమే లక్ష్యమన్న వైనం**



**ఆసిఫాబాద్ జూన్ 4 ప్రజా జ్యోతి** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఇళ్లు పూర్తిగా దగ్ధమై సర్వస్వం కోల్పోయిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, లైబ్రరీ చైర్మన్ అనిల్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబాలను పరామర్శించారు. బాధితుల కన్నీటి గాథను చూసి చలించిపోయిన ఆత్రం సక్కు తక్షణ సహాయంగా రూ. 10 వేల నగదు అందజేశారు. పరామర్శకే పరిమితం కాకుండా అక్కడి నుంచే ఎమ్మార్వోతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి బాధితులకు అందాల్సిన పరిహారం అత్యవసరంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. "బాధిత కుటుంబాలు ఎవరూ ఒంటరి కాదు... నేను మీకు అండగా ఉంటాను" అని భరోసా కల్పించిన సక్కు, వారికి ప్రభుత్వం ద్వారా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. లైబ్రరీ చైర్మన్ అనిల్ కూడా బాధితులకు ధైర్యం చెప్పారు.

# ధాన్యం దిగుమతి వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల ప్రతినిధి జూన్ 4, ప్రజా జ్యోతి:** ధాన్యం కొనుగోలు ప్రక్రియలో భాగంగా కొనుగోలు కేంద్రాల నుండి తరలించిన ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో గల స్టేట్ వేర్ హౌస్ కార్పొరేషన్ గోదామును మండల తహసిల్దార్ సంతోష్ కుమార్ తో కలిసి సందర్శించి ధాన్యం, మొక్కజొన్నల దిగుమతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసి కేటాయించిన ప్రకారం తరలించడం జరుగుతుందని తెలిపారు. ధాన్యంతో పాటు గోదాములకు వచ్చిన మొక్కజొన్నలను దిగుమతి చేసి నిల్వ చేయాలని నిర్వాహకులకు సూచించారు. హమాలీల పులి వేతనం చెల్లింపులపై పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ తో మాట్లాడి సకాలంలో కూలి డబ్బులు చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డయల్ 100 కాల్స్‌కు తక్షణమే స్పందించండి: ఎస్పీ నితికా పంత్

బెట్టింగ్, గంజాయిపై కఠిన చర్యలకు ఆదేశం





ఆసిఫాబాద్, జూన్ 04: ప్రజా జ్యోతి కొమురంభీం జిల్లా ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం జరిగిన నెలవారీ నేర సమీక్షలో ఎస్పీ నితికా పంత్ అధికారులకు పలు సూచనలు చేశారు. డయల్ 100 కాల్స్‌కు త్వరితగతిన స్పందించాలని, 'క్వాలిటీ ఇన్వెస్టిగేషన్'తో నేరస్తులకు శిక్ష పడేలా చేయాలని ఆదేశించారు. బెట్టింగ్, జూదం, మట్కా, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించి, సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్స్ గుర్తించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చిత్తరంజన్, డీఎస్పీ అశోక్, ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

## జీతాల్లో కోతలపై పంచాయతీ కార్మికుల ఆవేదన




ఆసిఫాబాద్, జూన్ 4 (ప్రజాజ్యోతి):కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్ర గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు తమ వేతనాల్లో కోతలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలల వేతనాలు ఒకేసారి జమ కావడంతో సంతోషించిన కార్మికులు, అనంతరం భారీ మొత్తాలు కట్ అయినట్లు గుర్తించి నిరాశకు గురయ్యామని తెలిపారు. గ్రామంలోని కాలువలు, రహదారుల పరిశుభ్రత కోసం ఎండా, వానా, చలినా విధులు నిర్వహిస్తున్నప్పటికీ పూర్తి వేతనాలు అందడం లేదని వారు ఆరోపించారు. 'అబ్సెంట్' పేరుతో జీతాల నుంచి కోతలు విధిస్తున్నారని, ఒక మహిళా కార్మికురాలి వేతనంలో రూ.12,500 వరకు కట్ చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే వేతనాల చెల్లింపులో జాప్యం జరుగుతుండగా, అందులోనూ కోతలు విధించడం వల్ల కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు. వేతనాల నుంచి కట్ చేసిన నగదు ఎక్కడికి వెళ్తోంది, దీనికి బాధ్యులు ఎవరు అనే విషయాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి స్పందించి వివరణ ఇవ్వాలని కోరిన కార్మికులు, ఉన్నతాధికారులు విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# కేంద్ర నిధులతోనే మంచిర్యాల అభివృద్ధి సాధ్యం

ఆర్మూర్--మంచిర్యాల జాతీయ రహదారి విస్తరణకు కేంద్రానికి బీజేపీ కృతజ్ఞతలు

రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి



మంచిర్యాల , 4 జూన్ (ప్రజాజ్యోతి) ;కేంద్ర ప్రభుత్వ నిధులతోనే మంచిర్యాల జిల్లా వేగంగా అభివృద్ధి చెందుతోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి తెలిపారు . ఆర్మూర్--మంచిర్యాల మధ్య జాతీయ రహదారి--63ను నాలుగు లైన్లుగా విస్తరించేందుకు రూ.5,203 కోట్లతో కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన సందర్భంగా గురువారం మంచిర్యాల పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో బిజెపి శ్రేణులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి, మాట్లాడుతూ జిల్లాలో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జాతీయ రహదారులు, రైల్వే స్టేషన్ల అభివృద్ధికి వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించి కేంద్ర ప్రభుత్వం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తోందని తెలిపారు. ఉత్తర, దక్షిణ భారత దేశాల మధ్య వేగవంతమైన రవాణా సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన నాగపూర్--విజయవాడ కారిడార్ లో భాగంగా చందాపూర్--మంచిర్యాల జాతీయ రహదారి 363 ఇప్పటికే పూర్తయిందని, మంచిర్యాల--విజయవాడ జాతీయ రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. నిన్న కేంద్ర కేబినెట్ ఆర్మూర్--మంచిర్యాల జాతీయ రహదారి--63 విస్తరణకు ఆమోదం తెలపడం జిల్లాకు మరో కీలక మైలురాయిగా అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు, పారిశ్రామిక అభివృద్ధి అవకాశాలు, సరుకు రవాణాలో వేగం పెరుగుతాయని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ రహదారుల నెట్‌వర్క్‌తో జిల్లాను అనుసంధానం చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణపై విమర్శలు గుప్పించిన ఆయన, జాతీయ రహదారి ప్రాజెక్టును తన కృషి ఫలితంగా చెప్పుకోవడం సరైందికాదన్నారు. జాతీయ రహదారి కోసం బీజేపీ నాయకులు అనేకసార్లు కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి విజ్ఞప్తి చేశారని తెలిపారు. జిల్లాకు జాతీయ రహదారులు, అమృత్ భారత్ రైల్వే స్టేషన్, వందే భారత్ రైలు వంటి అభివృద్ధి కార్యక్రమాలు బీజేపీ నాయకుల నిరంతర కృషి వల్లే వచ్చాయని, ఇందులో ఎంపీ పాత్ర లేదని అన్నారు .ఈ కార్యక్రమంలో వంగపల్లి వెంకటేశ్వర్ రావు, ఎనగందుల కృష్ణమూర్తి, సంజీవ్ రావు, బంగారు వేణుగోపాల్, అక్కల రమేష్, మల్యాల రాజమల్లు, ముదాం మల్లేష్, కుర్రె చక్రవర్తి, సత్రం రమేష్, ధన్‌సింగ్, బేరా రామన్న యాదవ్, సప్పిడి నరేష్, బూర రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

అదనపు లారీలతో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు





మంచిర్యాల , 4 జూన్ (ప్రజాజ్యోతి) ;జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుంచి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేసి, రవాణా ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అధికారులను ఆదేశించారు. గురువారం వేమనపల్లి మండలం గొర్లపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో, దస్నాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో, నీల్వాయి గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం కోటపల్లి మండలం సర్వాయిపేట గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కొనుగోలు కేంద్రం, భీమారం మండలం అర్కపల్లి గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాలను కూడా సందర్శించి కొనుగోలు, రవాణా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం ఎక్కువకాలం నిల్వ ఉండకుండా కొనుగోలు చేసి, వెంటనే తరలించేలా అదనపు లారీలను సమకూర్చాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రభుత్వం కేటాయించిన రైస్ మిల్లులు, గోదాములకు తరలించడం జరుగుతోందని పేర్కొంటూ, అక్కడికి చేరిన ధాన్యాన్ని కూడా త్వరితగతిన దిగుమతి చేయడం ద్వారా లారీల నిల్వ సమయాన్ని తగ్గించాలని సూచించారు. అవసరమైన మేరకు రవాణా వాహనాలను అందుబాటులో ఉంచి కొనుగోలు ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా గుత్తేదారులు సహకరించాలని ఆయన కోరారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభల్లో ప్రజా భద్రతపై అవగాహన

## నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## రామగుండం పోలీస్ కమిషనరేట్ అధికారులు





**మంచిర్యాల , 4 జూన్ (ప్రజాజ్యోతి)** ;ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు గురువారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల పెద్దపల్లి జోన్లలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రామాలు, వార్డుల్లో నిర్వహించిన గ్రామ సభల్లో డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు మరియు పోలీస్ సిబ్బంది స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి గ్రామాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నేరాల నియంత్రణ, ప్రజల రక్షణ, భద్రత, చట్టాలపై అవగాహన, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, యువత మరియు ప్రజల సామాజిక బాధ్యతలకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి పౌరుడి పాత్ర ఎంతో ముఖ్యమని వివరించారు. అలాగే "అరైవ్ అలైవ్" కార్యక్రమం కింద రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచిస్తూ, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ ధరించడం ద్వారా ప్రాణనష్టాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగంగా ప్రయాణించడం ప్రమాదాలకు ప్రధాన కారణాలన్నారు. మహిళలు, బాలికల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని అధికారులు తెలిపారు. మహిళలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్, సైబర్ వేధింపులు వంటి ఘటనలపై వెంటనే ఫిర్యాదు చేయాలని, షీ టీమ్ సేవలను నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనపై కూడా అవగాహన కల్పిస్తూ, మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతాయని హెచ్చరించారు. మాదకద్రవ్యాల విక్రయం, రవాణా, వినియోగం చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని, ఇటువంటి కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సైబర్ నేరాల నివారణపై మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ కాల్స్, నకిలీ వెబ్‌సైట్లు, ఓటీపీ మోసాలు, డిజిటల్ అరెస్ట్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్లు, ఓటీపీలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. అదేవిధంగా సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించడం, బాల్య వివాహాల నివారణ, మహిళలు మరియు బాలల రక్షణ, ప్రజా శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ ప్రజలు చట్టాలను గౌరవిస్తూ పోలీస్ శాఖకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలపై వెంటనే సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే సురక్షితమైన, నేరరహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ గ్రామ సభ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# సీసీసీ నస్పూర్ పోలీసుల ఆకస్మిక తనిఖీలు

**మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక నిఘా -- ఎస్ఐ ప్రశాంత్**



**మంచిర్యాల , 4 జూన్ (ప్రజాజ్యోతి)** ;రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మాదక ద్రవ్యాల నిర్మూలన, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ ప్రశాంత్ ఆధ్వర్యంలో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సహాయంతో చేపట్టిన ఈ తనిఖీల్లో నస్పూర్ ప్రాంతంలోని పలు దుకాణాలు, పాన్ షాపులు, టీ స్టాల్స్, యువత ఎక్కువగా గుమికూడే ప్రాంతాలు, ధూమపానం చేసే ప్రదేశాలు మరియు ఇతర అనుమానాస్పద ప్రాంతాలను విస్తృతంగా పరిశీలించారు. మాదక ద్రవ్యాల రవాణా, విక్రయం, నిల్వ, వినియోగం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రశాంత్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటమే లక్ష్యంగా నిరంతరం తనిఖీలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు . గంజాయి, డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాల రవాణా, విక్రయం, నిల్వ లేదా వినియోగానికి పాల్పడే వారిపై చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని, ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బందితో పాటు నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

# అగ్ని బాధితులకు రూ.95 వేల ఆర్థిక సాయం: కలెక్టర్ హరిత

**ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకు ఆదేశం**

**పాక్షికంగా దెబ్బతిన్న కుటుంబానికి రూ.9 వేలు**



**ఆసిఫాబాద్ జూన్ 4 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు కాలిపోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు. పూర్తిగా నష్టపోయిన రెండు కుటుంబాలకు తక్షణ సహాయంగా ప్రభుత్వం తరఫున రూ. 95,100, పాక్షికంగా ఇల్లు దెబ్బతిన్న కుటుంబానికి రూ. 9 వేల ఆర్థిక సాయం మంజూరు చేసినట్లు వెల్లడించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని హౌసింగ్ పీడీని ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని సహాయక చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

# విద్యార్థుల పక్షన ఎబివిపి



**మామడ జూన్ 5 (ప్రజా జ్యోతి)** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో నారాయణ పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు యూనిఫామ్స్ లు బెల్టులు పెన్నులు కిట్స్ విక్రయిస్తున్న నారాయణ పాఠశాల యాజమాన్యం విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్ల పేరిట దోపిడీకి పాల్పడుతున్న కార్పొరేట్ నారాయణ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి అని ఏబీవీపీ డిమాండ్ చేస్తుంది ఈ సందర్భంగా ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరె శశిశేధర్ మానవతా దృక్పథంతో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నారాయణ ప్రాంగణాల్లోనే పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫారాలు, షూస్ వంటివి విక్రయిస్తూన్నా న్నారు. బయట మార్కెట్ కంటే రెట్టింపు ధరలకు వీటిని అమ్ముతూ తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నారు. ముందస్తు అడ్మిషన్ల దోపిడీ: రాబోయే విద్యా సంవత్సరం ఇంకా ప్రారంభం కాకముందే, అడ్మిషన్ల పేరిట వేల రూపాయల ఫీజులను అక్రమంగా వసూలు చేస్తున్నారు. సీట్లు అయిపోతాయనే కృత్రిమ భయాన్ని సృష్టించి తల్లిదండ్రులను ఒత్తిడికి గురిచేస్తున్నారు నిబంధనలు ఉల్లంఘిస్తున్న కార్పొరేట్ నారాయణ పాఠశాల విద్యాసంస్థలపై టాస్క్‌ఫోర్స్ కమిటీలతో తక్షణమే తనిఖీలు చేపట్టాలి. ప్రభుత్వ ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలి. ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు కేవలం విద్యాబోధనకు సంబంధించిన ఫీజులు మాత్రమే వసూలు చేసేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుంది ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ దినేష్, సాయి కుమార్,శివకుమార్, మున్నా, పవన్, కార్తీక్, అక్లేష్, సాయి అక్షయ్, రాంచరణ్, మాల్యాద్రి, శేషు, అశ్వంత్, రాజకుమార్, రాజేష్, సాయి, శివ తదితరులు పాల్గొన్నారు

# కలసి ఉంటె కలదు సుఖం అన్నారు పెద్దలు. సింగరేణి సంస్థ 130 ఏళ్లకు పైగా సుదీర్ఘ చరిత్ర ఉన్న సంస్థ. ప్రస్తుత పరిస్తితుల్లో

"సంక్షోభం " లో ఉన్నదని కార్మిక సంఘాలన్ని పాడుతున్న పాట . అయితే కలసి కట్టుగా మాత్రం పోరాటాలకు " నై " అంటూ , ఒంటరి పోరాటాలకు "సై " అంటున్నాయి . ఇందులో ఉన్న మర్మం,లా భాపెక్ష ఏమిటో వాటికే తెలియలి .ఈ నేపధ్యం లో "ప్రజాజ్యోతి" ప్రత్యేక కథనం ...

సింగరేణిలో పెరుగుతున్న రాజకీయ వేడి

నిరసనలు,ధర్నాలు ,"బాయిబాట"లతో కోల్‌బెల్ట్‌లో హల్‌చల్

కార్మిక సమస్యలే కేంద్రబిందువు.. ఉద్యమాలతో వేడెక్కుతున్న బొగ్గు గనుల ప్రాంతాలు

కేంద్రం--రాష్ట్రం--కార్మిక సంఘాలు సమన్వయంతో ముందుకెళ్లాలంటున్న మేధావులు

మంచిర్యాల, 4, జూన్ (ప్రజా జ్యోతి):

తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు జీవనాడిగా భావించే సింగరేణి బొగ్గు గనుల సంస్థలో ప్రస్తుతం రాజకీయ, కార్మిక పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. కార్మికుల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం వివిధ కార్మిక సంఘాలు చేపడుతున్న ఉద్యమాలు, మరోవైపు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించిన "బాయిబాట" పర్యటనతో కోల్‌బెల్ట్ ప్రాంతంలో రాజకీయ వేడి పెరిగింది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలకు విస్తరించిన సింగరేణి ప్రాంతంలో ప్రస్తుతం కార్మిక సంఘాల హల్‌చల్ ప్రధాన చర్చనీయాంశంగా మారింది.

సింగరేణి కార్మికుల సమస్యలపై ఇప్పటికే గుర్తింపు కార్మిక సంఘమైన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) గనుల వద్ద, జీఎం కార్యాలయాల ఎదుట గేట్ మీటింగ్‌లు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తూ ఉద్యమాన్ని కొనసాగిస్తోంది. మెడికల్ ఇన్వాలిడేషన్, డిపెండెంట్ ఉద్యోగాలు, మారుపేరుల సమస్య, మెడికల్ బోర్డు సమావేశాల నిర్వహణ, కార్మిక సంక్షేమ అంశాలపై యాజమాన్యంపై ఒత్తిడి తీసుకువస్తోంది. ఇక ప్రాతినిధ్య సంఘమైన సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) కూడా తాము ఏమాత్రం వెనుకబడలేదన్నట్లుగా కార్మిక సమస్యలపై ఉద్యమ కార్యాచరణను కొనసాగిస్తోంది. ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్నప్పటికీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం "బాయిబాట" పేరుతో గేట్ మీటింగ్‌లు, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అదేవిధంగా తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) నాయకులు కూడా గనుల వద్ద, జీఎం కార్యాలయాల ఎదుట ఆందోళనలు నిర్వహిస్తూ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ బొగ్గుగని కార్మిక సమాఖ్య కన్వీనర్ తింగర్ల మల్లయ్య ఆధ్వర్యంలో కూడా కార్మిక సమస్యలపై ప్రత్యేక ఉద్యమాలు కొనసాగుతున్నాయి. ఇక సీఐటీయూ, బీఎంఎస్, హెచ్‌ఎంఎస్ తదితర కార్మిక సంఘాలు కూడా తమ తమ పద్ధతుల్లో ఉద్యమాలను ముమ్మరం చేశాయి. ఫలితంగా ప్రస్తుతం సింగరేణి వ్యాప్తంగా ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, బీఎంఎస్, టీబీజీకేఎస్, తెలంగాణ బొగ్గుగని కార్మిక సమాఖ్య వంటి సంఘాలు ఎవరికివారే వివిధ రూపాల్లో ఉద్యమాలు నిర్వహిస్తూ కార్మిక క్షేత్రాన్ని కదిలిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లోనే కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేసిన కల్వకుంట్ల కవిత ఈ నెల 15వ తేదీ నుంచి "బాయిబాట" కార్యక్రమం చేపట్టనున్నట్లు ప్రకటించి రూట్ మ్యాప్ విడుదల చేయడం మరింత చర్చకు దారితీసింది. కార్మికులతో నేరుగా సమావేశమై వారి సమస్యలను తెలుసుకుంటానని ప్రకటించడంతో రాజకీయ వర్గాలతో పాటు కార్మిక సంఘాల్లోనూ ఆసక్తి నెలకొంది. దీంతో కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో రాజకీయ వేడి మరింత పెరిగిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.




**తగ్గుతున్న కార్మికుల సంఖ్య.. పెరుగుతున్న ఆందోళన..........!**

ఒకప్పుడు లక్ష మందికి పైగా కార్మికులు పనిచేసిన సింగరేణిలో ప్రస్తుతం ఉద్యోగుల సంఖ్య 40 వేల లోపుకు పడిపోయింది. పదవీ విరమణలు పెరుగుతుండగా కొత్త నియామకాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఉద్యోగుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. మరో పదేళ్ల కాలంలో ఈ సంఖ్య మరింత తగ్గే అవకాశం ఉందని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు భూగర్భ గనుల (అండర్ గ్రౌండ్) సంఖ్య గణనీయంగా తగ్గిపోగా, ఓపెన్‌కాస్ట్ గనులే ఉత్పత్తిలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. భారీ యంత్రాల వినియోగంతో కొద్దిమంది కార్మికులతోనే అధిక ఉత్పత్తి సాధ్యమవుతుండటంతో భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు మరింత తగ్గిపోతాయనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. రానున్న రోజుల్లో మరిన్ని ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు ప్రారంభమయ్యే అవకాశాలున్న నేపథ్యంలో సింగరేణి భవిష్యత్తు, ఉద్యోగాల పరిరక్షణపై కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

**అపరిష్కృత సమస్యలే ఉద్యమాలకు కారణం........!!**

సింగరేణిలో ప్రస్తుతం మెడికల్ బోర్డు సమావేశాల నిర్వహణ, మెడికల్ ఇన్వాలిడేషన్ పెండింగ్ కేసులు, డిపెండెంట్ ఉద్యోగాలు, మారుపేరుల సమస్య, గుర్తింపు సంఘ ఎన్నికలు, కార్మికులకు సొంత ఇంటి పథకం, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చిన మెడికల్ కార్డు పరిమితిని రూ.2 లక్షలకు పెంచే అంశం వంటి పలు సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. మెడికల్ పూర్తయిన అభ్యర్థులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని, ప్రతి నెల మెడికల్ బోర్డు సమావేశాలు నిర్వహించాలని, మారుపేరుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని, సొంత ఇంటి పథకాన్ని అమలు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**రూ.50 వేల కోట్ల బకాయిల అంశం కూడా కీలకం.........!!!**

సింగరేణికి రావలసిన దాదాపు రూ.50 వేల కోట్లలోపు బకాయిలను వెంటనే విడుదల చేయాలని కూడా అన్ని కార్మిక సంఘాలు కోరుతున్నాయి. ఆ నిధులతో కొత్త గనులు, సాంకేతిక ఆధునికీకరణ, ఉద్యోగ అవకాశాల కల్పన, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టవచ్చని నాయకులు అభిప్రాయపడుతున్నారు.

**ఉత్పత్తి పెంపుపై సమీక్షలు..............!!!!**

ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులతో సమావేశమై బొగ్గు ఉత్పత్తిపై సమీక్ష నిర్వహించారు. మరోవైపు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి కూడా బొగ్గు ఉత్పత్తి, సింగరేణి భవిష్యత్తుపై సమీక్షలు నిర్వహించారు. బొగ్గు ఉత్పత్తి లేకుండా దేశంలోని విద్యుత్ కేంద్రాలు నడవవని అందరూ అంగీకరిస్తున్నారు. ఉత్పత్తి మరింత పెరగాల్సిన అవసరాన్ని కూడా నొక్కిచెబుతున్నారు.

**సమస్య ఎక్కడుందో గుర్తించాల్సిన సమయం........!!!!!**

అయితే ఉత్పత్తి పెంపు గురించి అందరూ మాట్లాడుతున్నప్పటికీ, కార్మికుల సమస్యల పరిష్కారం, భవిష్యత్తు ఉద్యోగ భద్రత, సంస్థ పరిరక్షణ వంటి అంశాలపై సమగ్ర కార్యాచరణ మాత్రం కనిపించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తెలంగాణ ప్రభుత్వానికి సింగరేణిలో 51 శాతం, కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉన్న నేపథ్యంలో పరస్పర విమర్శలకు అతీతంగా రెండు ప్రభుత్వాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని మేధావులు సూచిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, యాజమాన్యం, అన్ని కార్మిక సంఘాలు రాజకీయాలకు అతీతంగా కార్మికుల సంక్షేమం, సంస్థ పరిరక్షణ, భవిష్యత్ తరాల ఉపాధి అవకాశాల కోసం సమన్వయంతో ముందుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని పరిశీలకులతో పాటు మేధావులు కూడా అభిప్రాయపడుతున్నారు. సింగరేణి బలపడితేనే తెలంగాణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందనే భావన కోల్‌బెల్ట్ ప్రాంతంలో బలంగా వినిపిస్తోంది.

## సూర్దాపూర్ పంచాయతీ కార్యదర్శిగా ఆడే నాణేశ్వర్ బాధ్యతల స్వీకరణ



కేరమేరి జూన్ 4 ప్రజా జ్యోతి కేరమేరి మండలం సూర్దాపూర్ గ్రామ పంచాయతీ నూతన కార్యదర్శిగా ఆడే నాణేశ్వర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుర్సెంగా రాధాబాయి దందు, ఉప సర్పంచ్ సాగర్‌తో పాటు సోమయ్య సాయిరాం రఫీక్ గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన నాణేశ్వర్‌కు సర్పంచ్, ఉప సర్పంచ్ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి, ప్రభుత్వ పథకాల అమలుకు సహకరిస్తామని సర్పంచ్ రాధాబాయి తెలిపారు. గ్రామస్థుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తానని నూతన కార్యదర్శి నాణేశ్వర్ పేర్కొన్నారు.

## వంజర్ గ్రామంలో అవగాహన కార్యక్రమం




సారంగాపూర్, జూన్ 04,ప్రజా జ్యోతి నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జానకీ షర్మిల, ఐపీఎస్ ఆదేశాల మేరకు వంజర్ గ్రామంలో "గంజా-గస్తీ" అవగాహన కార్యక్రమం పోలీస్ నిర్వహించరు. ఈ కార్యక్రమంలో యువకులు, విద్యార్థులు గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించరు. గంజాయి వినియోగం, విక్రయం లేదా రవాణాకు సంబంధించిన సమాచా,అలాగే రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ, మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమం లో నాయకులు రమేష్, పోలీస్ సిబ్బంది లింగారం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బీఎస్పీ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్చార్జిగా

పరిమి సురేష్ కుమార్



ఖానాపూర్ జూన్ 4 (ప్రజా జ్యోతి ) బహుజన సమాజ్ వాది పార్టీ నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజక వర్గ ఇన్చార్జిగా పట్టణా నికి చెందిన పరిమి సురేష్ కుమార్‌ను నియమించి నట్లు జిల్లా అధ్య క్షులు జగన్మోహన్ అడ్వకేట్ ప్రకట నలో తెలిపారు ఖానాపూర్ కు చెందిన సురేష్ వార్డు సభ్యులుగా మున్సిపల్ కౌన్సిలర్ గా లత సురేష్ సతీమణి పదవులు పొందగా పర్మి సురేష్ 10 సంవత్సరాలుగా బిఆర్ఎస్ పార్టీకి పట్టణ అధ్యక్షునిగా పనిచేసి గత కౌన్సిలర్ ఎన్నికల్లో బీఎస్పీ లో చేరిపార్టీ తరపున ఏడవ వార్డులో పోటీ చేసి ఓటమిపాలయ్యారు అప్పటినుండి బీఎస్పీ పార్టీలో పనిచేస్తున్న సురేష్ కు నియోజకవర్గ ఇన్చార్జిగా నియమించబడడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు

# సమగ్ర ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా చేపట్టాలి

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




మంచిర్యాల , 4 జూన్ (ప్రజాజ్యోతి) ;మంచిర్యాల జిల్లాలో ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి గణన చేపట్టనున్నట్లు తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాల నమోదు అనంతరం బూత్ స్థాయి అధికారులు వివరాలను పరిశీలించి అర్హులైన ఓటర్ల ముసాయిదా జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. హేతుబద్ధీకరించిన ముసాయిదా ఓటరు జాబితాను జూలై 31న ప్రచురించనున్నట్లు చెప్పారు. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు ముసాయిదా జాబితాపై ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరించి, సెప్టెంబర్ 28 వరకు వాటిని ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పరిష్కరించాలని ఆదేశించారు. అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, ఒక కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్ల తొలగింపు, మ్యాపింగ్ ప్రక్రియల్లో రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్ల సహకారం తీసుకోవాలని అన్నారు. అర్హత గల ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఒకరికి ఒకే ఓటరు గుర్తింపు కార్డు ఉండాలని, రెండు లేదా అంతకంటే ఎక్కువ ఓటరు గుర్తింపు కార్డులు కలిగి ఉన్నవారు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. అలాగే మరణించిన వ్యక్తుల పేర్లు తుది జాబితాలో ఉండకూడదని, అటువంటి పొరపాట్లు జరిగితే సంబంధిత బూత్ స్థాయి అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లకు ఫారాల పూరింపు, జాబితా పరిశీలన తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 2002 ఓటర్ల జాబితాలోని వివరాల పరిశీలన, చిరునామా మార్పులు, ఇతర సవరణలను సమర్థవంతంగా చేపట్టాలని ఆదేశించారు. అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాలు నిండే యువత ఫారం-6, డిక్లరేషన్ ఫారం ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఓటర్లు వివరాల సవరణ, నమోదు తదితర అంశాల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1950, ఓటర్ల సేవల వెబ్‌సైట్, ఈసీఐనెట్ యాప్‌ను వినియోగించుకోవచ్చని సూచించారు. సమావేశం అనంతరం కలెక్టర్ ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల) గోదామును త్రైమాసిక తనిఖీలలో భాగంగా పరిశీలించారు. ఈవీఎం గోదాం వద్ద నిరంతర భద్రతా చర్యలు అమల్లో ఉన్నాయని, యంత్రాల రక్షణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, వి. రాములు, రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, ప్రత్యేక ఉపపాలన అధికారి డి. చంద్రకళతో పాటు సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# గంజాయి నిర్మూలనకు యువత ముందుకు రావాలి

చెన్నూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్. కృష్ణ

సర్వాయిపేటలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం

యువకులకు వాలీబాల్ కిట్ల పంపిణీ,

అగ్నివీర్‌కు ఎంపికైన యువకుడికి సన్మానం





మంచిర్యాల , 4 జూన్ (ప్రజాజ్యోతి) ;మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం సర్వాయిపేట గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంను గురువారం ఘనంగా నిర్వహించారు. చెన్నూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్. కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ యువకులకు రెండు వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ ఆర్. కృష్ణ మాట్లాడుతూ, ప్రస్తుతం సమాజాన్ని గంజాయి అనే మత్తు పదార్థం తీవ్రంగా ప్రభావితం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా యువత గంజాయి మత్తుకు బానిసలై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. గంజాయి సేవించడం వల్ల ఆరోగ్య సమస్యలు పెరగడమే కాకుండా నేరప్రవర్తన, కుటుంబ విభేదాలు, సామాజిక అస్థిరత కూడా పెరుగుతున్నాయని తెలిపారు. యువత చదువు, ఉద్యోగాలు, క్రీడలు, జీవిత లక్ష్యాల నుంచి దూరం కాకుండా జాగ్రత్తపడాలని సూచించారు. గంజాయి నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, గ్రామాల్లో ఎవరైనా గంజాయి సేవిస్తున్నా లేదా విక్రయిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే మత్తు పదార్థాల నిర్మూలన సాధ్యమవుతుందని అన్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన ఆలోచనలు, జట్టు భావనను పెంపొందిస్తాయని పేర్కొంటూ యువత క్రీడల వైపు మరింత ఆసక్తి చూపాలని సూచించారు. ఈ నేపథ్యంలో గ్రామ యువకులను ప్రోత్సహించేందుకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా సర్వాయిపేట గ్రామానికి చెందిన ఉప్పరి సాయికుమార్ అగ్నివీర్ సైనిక ఉద్యోగానికి ఎంపిక కావడంతో సీఐ ఆర్. కృష్ణ, ఎస్సై రాజశేఖర్ కలిసి ఆయనను ఘనంగా సన్మానించారు. గ్రామ యువత సాయికుమార్‌ను ఆదర్శంగా తీసుకొని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి ఎస్సై రాజశేఖర్, హెడ్ కానిస్టేబుల్ బుజ్జిబాబు, పోలీసు సిబ్బంది, సర్వాయిపేట గ్రామ సర్పంచ్ రాజేష్, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# మోటార్ సైకిల్ తోఎమ్మెల్యే గిరిజన గ్రామాల్లో సమస్యల పట్ల పర్యటన

## అల్లంపల్లి ప్రజల పట్టాలతో పాటు సమస్యలు పరిష్కరిస్తా

## జిల్లా కలెక్టర్ తో ప్రత్యేక సమావేశం ఎమ్మెల్యే వేడమ బొజ్జు పటేల్ హామీ

**ఖానాపూర్ జూన్ 4( ప్రజా జ్యోతి )** ఖానాపూర్ నియోజకవర్గంలోని గిరిజన, ఆదివాసి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తామంటూ కడెం మండలం అల్లంపల్లి గ్రామ పర్యటనలో బాగంగా గురువారం ఉదయం ద్విచక్ర వాహనం( మోటార్ సైకిల్ పై )తో చేరుకున్న నిర్మల్ డిసిసి అధ్యక్షులు,ఖానాపూర్ ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటేల్ అల్లంపల్లి గ్రామపంచాయతీలో సమస్యల పై ప్రజలతో చర్చించారు,ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి,బోర్వెల్ డ్రిల్లింగ్ కి ప్రజలను ఇబ్బంది పెట్టకూడదని ఫారెస్ట్ అధికారులను ఆదేశించారు,గ్రామ పంచాయతీ వర్కర్స్ కి శానిటేషన్ కిట్స్ పంపిణీ చేశారు. బాబనాయక్ తండా లో వివో అంగన్వాడీ,గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణాలకు భూమి పూజ చేశారు. గ్రామాల్లో తిరుగుతూ రహదారుల మరుగుదొడ్ల నిర్మాణానికి అధికారులను ఆదేశించారు,ప్రారంభించి అటవీ శాఖ ఇబ్బందుల వల్ల నిలిపేసిన ఇందిరమ్మ ఇండ్లను సందర్శించారు. చాలా కాలంగా ఉన్న అల్లంపల్లి రోడ్డు సమస్య పరిష్కారానికి పూర్తి స్థాయి నివేదికతో శుక్రవారంనిర్మల్ జిల్లా కలెక్టర్ తో సమావేశం ఏర్పాటు చేయాలని భవేష్ మిశ్రా తో చరవాణిలో మాట్లాడారు,రేపు గ్రామస్తులు నాయకులతో కలెక్టర్ కార్యాలయంలో సమావేశానికి రావాలని గ్రామస్తుల వద్ద ఉన్న పాత పట్టాలు,తీసుకొని రావాలని గ్రామ పెద్దలకు సూచించారు.అలంపల్లి రోడ్డు శాశ్వత




పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.సుదూర ప్రాంతాల నుండి ఎమ్మార్వో ,ఎంపీడీఓ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సకాలంలో వారి పనులు పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్ ఆదేశించారు.రానున్న వర్ష కాలంలో గాలి, వాన,పిడుగుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో,పంచాయతీ రాజ్ ఏఈ,సర్పంచ్లు గ్రామస్తులు, కడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొడ్డు గంగన్న పొద్దుటూరు సతీష్ రెడ్డి చంద్రయ్య కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా విక్రయాల్లో దళారుల దోపిడీ

**ప్రభుత్వ ధర రూ. 267..**
**దళారుల రేటు రూ. 320:**

**నేరడిగొండ, జూన్ 04 ప్రజాజ్యోతి:**వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం యాప్ ద్వారా యూరియా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే, ఇదే అదునుగా భావించిన




కొందరు దళారులు రైతుల అమాయకత్వాన్ని, ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుని దోపిడీకి తెరలేపారు.ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం యూరియా బస్తా రూ. 267 లకే రైతులకు అందాల్సి ఉంది. కానీ, ప్రస్తుత తరుణంలో రైతుల వద్ద పెట్టుబడికి తగినంత నగదు లేకపోవడంతో వారు దళారులను ఆశ్రయిస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న సదరు దళారులు, వ్యాపారులు తమ అధికారిక దుకాణం చిట్టీలపై కాకుండా, తెల్ల కాగితాల (ప్లేన్ పేపర్) పై బస్తాకు రూ. 320 చొప్పున రాసి ఇస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. బస్తాకు అదనంగా రూ. 53 వసూలు చేస్తూ రైతుల శ్రమను దోచుకుంటున్నారు.

**లబోదిబోమంటున్న రైతాంగం..**

దళారుల చేతిలో మోసపోతున్నప్పటికీ, తాము నోరు విప్పితే భవిష్యత్తులో తమకు ఎరువులు, పురుగుల మందులు ఇవ్వరేమోననే భయంతో రైతులు ఈ అన్యాయాన్ని బయటకు చెప్పుకోలేకపోతున్నారు. ఏది ఏమైనప్పటికీ, ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వం నిర్ణయించిన రూ. 267 లకే తమకు యూరియా బస్తాలు అందేలా చూడాలని మండల రైతాంగం కోరుతోంది.

**ఫిర్యాదు చేస్తే లైసెన్సులు రద్దు చేస్తాం: ఏవో కృష్ణవేణిలి**

ఈ దోపిడీ వ్యవహారంపై 'ప్రజాజ్యోతి' ప్రతినిధి నేరడిగొండ మండల వ్యవసాయ అధికారి కృష్ణవేణిని వివరణ కోరగా.. ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇలా రైతులను మోసం చేయడం ఎంతమాత్రం సరికాదన్నారు. అధిక ధరలకు ఎరువులు విక్రయించే ఫర్టిలైజర్ షాపులపై రైతులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే, తక్షణమే విచారణ జరిపి సదరు దుకాణాల లైసెన్సులను రద్దు చేస్తామని ఏవో హెచ్చరించారు.

## తెలంగాణ ప్రజా పాలనా ప్రణాళికలో భాగంగా గ్రామ సభ



**ఆసిఫాబాద్ జూన్ 4 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ వాంకిడి మండలంలోని జంబూల్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలనా ప్రత్యేక ప్రణాళికలో భాగంగా ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, ఎంపీవో, తహసీల్దార్, డీటీ, ఏఈ, సర్పంచ్ పవన్, ఉప సర్పంచ్ విట్టల్, పంచాయతీ కార్యదర్శి జహూర్ అహ్మద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాయణ, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని అధికారులు పేర్కొన్నారు.

## అకాల వర్షానికి ఆగమైన అన్నదాత బతుకు

**తడిసిన వడ్లను మొక్కజొన్నను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి,**



**కుంటాల జూన్ 04 ( ప్రజాజ్యోతి)**అకాల వర్షానికి ఆగమైన అన్నదాత ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకుంటున్నా రైతులు, కుంటాల మండలంలోని గురువారం రోజు,పలు గ్రామలలో ఇదురు గాలులతో కూడిన ఉరుములు మెరుపులతో కూడిన వర్షం రైతన్నలకు కంట కన్నీరు మిగిలింది ఆరుగాలలు కష్టపడి పండించిన పంట, అకాల వర్షానికి తడిసి ముద్దవ్వడంతో ఆగమైన రైతన్న జీవితం కొనుగోలు కేంద్రాలు వేగవంతం లేకపోవడంతో గత నెల రోజుల నుండి ఐకెపి ఆవరణలో రాత్రింబవళ్ళ ఎర్రటి ఎండలో నిద్రలు మానుకొని రైతులు రాత్రిం బావళ్ళు పాడుగాపులు కాచిన కొనుగోలు ప్రక్రియ లారీలు లేక హమాలీల కొరత వల్ల ఇప్పటికీ (ఇరవై శాతం )వరకు రైతుల మొక్క జొన్న మరియు వడ్లు తూకం వేయకుండానే కుప్పలుగా ఉండిపోయాయి, గత రెండు రోజుల నుండి కుంటాలలో కురుస్తున్న భారీ వర్షాలకు రైతులు మొక్కజొన్న మరియు వడ్ల కుప్పలపై టార్పిన్ కవర్లు కప్పినప్పటికీ బలంగా విస్తున్న ఈదురుగాల వల్ల అవి ఎగిరిపోగా వర్షానికి మొక్కజొన్న మరియు వడ్ల గొప్పలు సగానికి పైగా పూర్తిగా తడిసిపోయాయి రైతులను తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి తగు న్యాయం జరిపించాలని కుంటాల మండలం రైతులు ఆవేదన వ్యక్తం చేశారు

## నేరడిగొండ నూతన అధికారులకు ఘన సన్మానం



నేరడిగొండ, జూన్ 04 (ప్రజా జ్యోతి):నేరడిగొండ మండల పరిషత్ నూతన అదనపు బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో రమేష్, ఎంపీఓ జీవన్ రెడ్డి, అలాగే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్ఐలు) సాయిరాం మరియు మమతాలను గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు.నేరడిగొండ సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి, లకంపూర్ (జి) గ్రామ సర్పంచ్ సేడమకి సుజాత గంగాధర్, నాగమల్యాల సర్పంచ్ గోడెం నందిని అమృత్ లు నూతన అధికారులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.మండల అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి నూతన అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటూ సహకరించాలని ఈ సందర్భంగా సర్పంచులు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఏఈఓ స్రవంతి



నేరడిగొండ జూన్ 04( ప్రజా జ్యోతి ):మండలంలోని కుమారి గ్రామంలో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (ఏఈఓ) స్రవంతి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రానికి వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఈఓ ప్రవీణ్, రాజేందర్‌లను ఆదేశించారు.త్వరలోనే వర్షాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, కేంద్రంలో ఉన్న జొన్న బస్తాలు తడిసిపోకుండా తక్షణమే లారీలను తెప్పించి గోదాములకు తరలించాలని సూచించారు. రైతులు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, కేంద్రానికి వచ్చిన ప్రతి జొన్న బస్తాను కొనుగోలు చేసి భద్రపరుస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గడ్డం భీమ్‌రెడ్డి, సిర్ల రమణయ్య, భోజన్న స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బాబాపూర్‌లో ప్రత్యేక గ్రామసభ

'అమ్మ పేరు మీద ఒక మొక్క' కార్యక్రమంలో మొక్కల నాటకం



ఆసిఫాబాద్ జూన్ 4 (ప్రజా జ్యోతి ఆసిఫాబాద్, న్యూస్‌టుడే: ఆసిఫాబాద్ మండలంలోని బాబాపూర్ గ్రామపంచాయతీలో 99వ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించారు.ఈ సందర్భంగా 'అమ్మ పేరు మీద ఒక మొక్క' (ఏక్ పెడ్ మా కే నామ్) కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (ఏసీఎల్‌బీ) యువరాజ్, జడ్పీ సీఈఓ, డీపీఓ భిక్షపతి, డీఎల్‌పీఓ ఉమర్, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీవో మౌనిక, ఏపీఓ (ఈజీఎస్) బుచ్చన్న, సర్పంచ్ రాజన్న, గ్రామ పంచాయతీ కార్యదర్శి దేవరాజ్, మండల అధికారులు, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అంబకంటిలో మహిళ సంఘ నూతన భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే





రామారావు పటేల్ ఎమ్మెల్యే ముధోల్ :-
భవేష్ మిశ్రా నిర్మల్ జిల్లా కలెక్టర్ :-
తహసీల్దార్ ఆడే కామల్ సింగ్ :-
రాణి ప్రవీణ్ సర్పంచ్ అంబకంటి :-

కుంటాల జూన్ 04 ( ప్రజాజ్యోతి)కుంటాల మండలంలోని అంబకంటి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామీణ మహిళా సంఘాల భవనం మరియు షెడ్‌ను ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ప్రారంభించారు. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారతకు దోహదపడే ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ రైతులు సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల మార్పిడి విధానాలను అవలంబించాలని సూచించారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అనుసరించడం ద్వారా దిగుబడులు పెంచుకోవడంతో పాటు ఆదాయాన్ని కూడా మెరుగుపరుచుకోవచ్చని అన్నారు. భూగర్భ జలాల పరిరక్షణ నేటి అవసరమని, నీటి వనరులను కాపాడేందుకు ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా చర్యలు చేపడుతోందని తెలిపారు. రైతులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్ తరాలకు నీటి వనరులను సంరక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు.అనంతరం



అంబకంటి గ్రామంలో నూతనంగా నిర్మించిన వివో భవనం, ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పాల్గొని వాటిని ప్రారంభించారు. మౌలిక వసతుల కల్పన, విద్యా సంస్థల అభివృద్ధి, మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని, ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాణి ప్రవీణ్, తహసీల్దార్ ఆడే కమల్ సింగ్ ఎంపిడిఓ అల్లాడి వనజ, ఎంపిఓ శోభన,,ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, గ్రామ పెద్దలు, యువకులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలకు గుర్తింపుగా నిర్మల్ జిల్లాలో 11 మంది పోలీసు అధికారులకు సేవా పథకాలు బహుకరించి సత్కరించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల




ఖానాపూర్ జూన్ 4 (ప్రజా జ్యోతి) నిర్మల్ జిల్లాలో పోలీసు శాఖలో విధి నిర్వహణలో విశిష్ట ప్రతిభ కనబరిచి, ప్రజలకు ఉత్తమ సేవలు అందించినందుకు గాను 2026 సంవత్సరానికి జిల్లా నుండి 11 మంది పోలీసు అధికారులు, సిబ్బంది సేవా పథకాలకు ఎంపికయ్యారు ఈ సందర్భంగా ఈరోజు జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల,సేవా పథకాలకు ఎంపికైన అధికారులను సిబ్బందిని, షేక్ అహ్మద్ ఎఎస్ఐలు ఆర్.గంగారాం వై.గంగాధర్ డి.రాజారాం హెడ్ కానిస్టేబుల్స్ ,పి.మస్తాన్ రావుపి. రత్నారావు హెచ్.గంగాధర్ బి.గోవింద్,వేట్టి సింగ్,జె.గేమ్ సింగ్, ఏ ఆర్ హెచ్ ఎస్ సి కె.రమేష్ పోలీస్ కానిస్టేబుల్ లను అభినందించి పథకాలతో సత్కరించారు.ఈ సందర్భంగా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ విధి పట్ల అంకితభావంతో పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందడం పోలీసు సిబ్బంది ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.సేవా పథకాలకు ఎంపిక కావడం గర్వకారణమని, బాధ్యతతో పనిచేయడానికి ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. అలాగే జిల్లాలోని ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ శాఖ ప్రతిష్ఠను పెంచాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, తో పాటు, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఉపేందర్ రెడ్డి, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్, ఆర్.ఐ రామ్ నిరంజన్ రావ్,పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు తమ పంటలు వేసుకోవాలి





**పంట మార్పిడి పద్ధతులు అవలంబించాలి**

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**గ్రామ మహిళా సంఘ భవనం, జీవనోపాధి ఆర్థిక సాధికారిత కేంద్రాల ప్రారంభం**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,జూన్ 4 ,( ప్రజాజ్యోతి ).**వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు తమ పంటల సాగులో మార్పులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. గురువారం కుంటాల మండలం అంబగంటి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్, శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్‌తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది ఆశించినంత స్థాయిలో వర్షపాతం ఉండకపోవచ్చని వాతావరణ శాఖ నివేదికలు సూచిస్తున్నందున రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని అన్నారు. పంట మార్పిడి పద్ధతులను అవలంబించి, తక్కువ నీటి అవసరమయ్యే కొత్త రకాల పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ విషయంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవసరమైన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం అందిస్తారని తెలిపారు.ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించి అధిక లాభాలు పొందాలని, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని వినియోగించుకొని డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, లైసెన్స్ పొందిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు. విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.అవసరానికి మించి ఎరువులు వాడరాదని సూచించిన కలెక్టర్, జిల్లాలో రికార్డు స్థాయిలో మొక్కజొన్న కొనుగోలు జరిగిందని, రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోలులో నిర్మల్ జిల్లా మూడో స్థానంలో నిలిచిందని తెలిపారు. రాబోయే వర్షాకాలంలో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను కూడా పాటించాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా చెత్త బండ్లలో వేయడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని, ప్లాస్టిక్ వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు అనేక రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. వర్షపు నీటిని వృథా కాకుండా ఒడిసిపట్టుకోవాలని, సోక్‌పిట్లు నిర్మించడం ద్వారా భవిష్యత్తు తరాలకు నీటి కొరత రాకుండా చూడాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ, ఈ సంవత్సరం తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు కందులు, మినుములు, పెసర్లు, నువ్వులు, పొద్దుతిరుగుడు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులు మంచి లాభాలు పొందుతున్నారని, ఇతర రైతులు కూడా ఆ దిశగా ముందుకు రావాలని అన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఇద్దరు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు.గ్రామ మహిళా సంఘ భవనం, జీవనోపాధి ఆర్థిక సాధికారిత కేంద్రాల ప్రారంభం అంతకుముందు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ మహిళా సంఘ భవనం, జీవనోపాధి ఆర్థిక సాధికారిత కేంద్రాలను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.గ్రామసభకు హాజరైన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో డీపీఓ శ్రీనివాస్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీడీఓ వనజ, సర్పంచ్ జ్యోతిబాయి, ఇతర అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రైతాంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐయుకేఎస్ ఆధ్వర్యంలో ఖానాపూర్ తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

**వినతి పత్రం అందజేత**

**ఏఐయుకేఎస్ జిల్లా అధ్యక్షుడు నందిరామయ్య**



**ఖానాపూర్ జూన్ 4( ప్రజా జ్యోతి )**అఖిలభారత ఐక్య రైతు సంఘం ఏఐయుకేఎస్ జాతీయ కమిటీ పిలుపు మేరకు గురువారం ఏఐయు కేఎస్ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా ఖానాపూర్ తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నందిరా మయ్య మాట్లాడుతూ రైతాంగ సమస్యలు పరిష్కరించాలని, రైతాం గానికి అవసరమైన విత్తనాలు ఎరువులు, పురుగు మందులు ఉచి తంగా ఇవ్వాలని, కల్తీ విత్తనాలు అరికట్టాలని, కల్తీ విత్తన వ్యాపారు లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, రైతాంగానికి అవసరమైన వ్యవసాయ పనిముట్లు సగం సబ్సిడీపై ఇవ్వాలని, ఎంఎస్పి చట్టం చేయాలని, ఇండో అమెరికన్ వాణిజ్య ఒప్పందం రద్దు చేయాలని, ధర్నా సందర్భంగా నందిరామయ్య డిమాండ్ చేశారు ఈ కార్య క్రమంలో ఏఐయుకేఎస్ ఖానాపూర్ మండల నాయకులు జక్కుల రాజన్న, గోరే బాయ్, అడ్లగట్ట శంకర్, గోనే నారాయణ, వర్మ, జైతూ, నర్సింగరావు లింగాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత ఏపీవో నీలారాణి



**నేరడిగొండ జూన్ 04 (ప్రజాజ్యోతి ):** మండలంలోని కుమారి గ్రామంలో ఐకెపి మహిళలు మరియు గ్రామ ప్రజలకు పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లస్మన్న, ఉప సర్పంచ్ ఆడేపు రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీఓ నీలారాని, ఏఈఓ స్రవంతి, ఐకెపి సీసీ కవిత మరియు వార్డు సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏపీఓ నీలారాని మాట్లాడుతూ.. గ్రామంలోని పరిసర ప్రాంతాలను, డ్రైనేజీలను శు భ్రంగా ఉంచుకోవడంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. ఇంటి చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మలేరియా వంటి ప్రమాదకరమైన రోగాలు జబ్బుల బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చని తెలిపారు. ఆరోగ్యం కోసం పరిశుభ్రతను పాటించడం ప్రతి ఒక్కరి హక్కు మరియు కనీస బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు.


# మ్యూల్ అకౌంట్ ద్వారా 8 కోట్లకు పైగా రూపాయల కాజెచేత నిందితుల అరెస్ట్

**సైబర్ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జి జానకి షర్మిలవెల్లడి**




**ఖానాపూర్ జూన్ 4 (ప్రజా జ్యోతి)** శ్రమ లేకుండా ఈజిమణి మొహంలో సైబర్ నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులకు శిక్షలు తప్పవని నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జి జానకి షర్మిల హెచ్చరించారు డబ్బు ఆశతో ఇతరుల బ్యాంకు ఖాతాలనుండి చెక్ బుక్ లో నుండి ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా సైబర్ నేరాలకు పాల్పడి 8 కోట్ల 18 లక్షల రూపాయలు కాల్ చేసిన నేరలపై గురువారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎస్పి కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ ఉపేంద్ర రెడ్డి తో కలిసి నిర్మల్ జిల్లాకు చెందిన సైబర్ నేరగాళ్లు దేశంలోని పలు రాష్ట్రాల్లో సైబర్ నేరాలతో ఇతరుల ఖాతాల నుండి కాజేసిన ముఠాను పట్టుకున్నట్లు ఎస్పీ డాక్టర్ జి జానకి షర్మిల విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు సైబర్ నేరాలకు పాల్పడిన ముగ్గురు లోకేశ్వరం మండలానికి చెందినవారు కాగా ఈ ముగ్గురు నిందితులను ఇప్పటికే అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచామని సోన్ మండలానికి చెందిన మరో ఇద్దరిని కూడా అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నామన్నారు సైబర్ నేరాలకు పాల్పడిన నిమ్మ గజేందర్ మగ్గిడి నవీన్ మగ్గిడి మహేందర్ మేకల నిఖిల్ షికారి సాయికృష్ణలపై బాధితులు ఫిర్యాదు చేయగా వీరిపై ఇప్పటికే కేసులు నమోదయ్యాయని వివరించారు సైబర్ నేరస్తులు ఇప్పటివరకు 8 కోట్ల 18 లక్షల రూపాయల వరకు ఇతరుల ఖాతాల నుండి కాజేసినట్లు తమ విచారణలో తేలిందన్నారు ఆన్లైన్ మోసాలకు పాల్పడే వారిని సహించేది లేదని వీరిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు డబ్బుల ఆశతో తమ బ్యాంకు ఖాతాలను ఏటీఎం కార్డులను మొబైల్ నెంబర్లను ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలను ఎవరికి కూడా ఇవ్వకూడదని ఇలాంటి వివరాలను ఇతరులకి ఇస్తే సైబర్ నేరాలు జరుగుతాయని సైబర్ నేరగాళ్ల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని అన్నారు సైబర్ నేరగాళ్లను చాక చక్యంగా పట్టుకున్న బైంసా ఏఎస్పీ సాయికిరణ్ నిర్మల్ డిఎస్పి శ్రీనివాస్ వారి సిబ్బందిని ఎస్పీ జానకి షర్మిల అభినందించారు

## మహిళా విభాగం మండల అధ్యక్షులుగా మాజీ ఎంపిటిసి సామల పద్మ వీరయ్య



సారంగపూర్, జూన్ 04,ప్రజా జ్యోతి కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా సామల పద్మను నియమించినట్లు జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సీ హెచ్ భవాని తెలిపారు.జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సీ హెచ్ భవాని మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి మహిళల పాత్ర కీలకమని, మండల స్థాయిలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, మహిళలను పార్టీ వైపు ఆకర్షించాలని సామల పద్మకు అన్నారు.తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపిన సామల పద్మ, పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయిలో ప్రజలకు చేరవేస్తూ మహిళా విభాగాన్ని బలోపేతం చేస్తానని, మహిళల సమస్యల పరిష్కారానికి, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని హామీ ఇచ్చారు.

## మీరు ఏర్పాటు చేసుకునే సిసి కెమెరాలు మీ గ్రామానికి రక్షణ కవచాలు ఎస్సై జి శ్రావణి




లక్ష్మణ చాంద, జూన్ 4 (ప్రజాజ్యోతి) మీరు ఏర్పాటు చేసుకునే సిసి కెమెరాలు మీ గ్రామానికి రక్షణ కవచాలని ఎస్సై జి శ్రావణి అన్నారు. మండలంలోని మునిపెల్లి గ్రామంలో విడిసి సభ్యులు, గ్రామస్తులతో గురువారం సాయంత్రం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తే నిరంతరం నిఘా ఉంటుందని తద్వారా నేరాలు జరిగే అవకాశాలు నిరోధించబడతాయన్నారు. సిసి కెమెరాల ఏర్పాటు కోసం ఆయా గ్రామాల విడిసిలు కృషి చేయాలని తెలిపారు. అలాగే సైబర్ క్రైం గురించి వివరించారు. సైబర్ క్రైం బారిన పడకుండా ఉండాలంటే తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలను వివరించారు. గంజాయిని సేవిస్తే చట్ట రిత్య నేరమని,గంజాయిని అమ్మే వ్యక్తులగురించి పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు.వర్షాకాల సీజన్ ప్రారంభమవుతున్నందున అందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా గోదావరి నదీ పరివాహక ప్రాంతాల పశుకాపరులు,ప్రజలు లోతట్టు ప్రాంతాలకు వెల్లకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది మునిపెల్లి వీడీసీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వడ్డుర్ లో గ్రామ సభ



నేరడిగొండ, జూన్ 04 (ప్రజాజ్యోతి):నేరడిగొండ మండలం లోని వడ్డుర్ గ్రామంలో గురువారం సర్పంచ్ ఆడెపు శ్రీకాంత్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులతో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధు లు భారీగా హాజరయ్యారు.సభలో ఉప సర్పంచ్ మమత, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు చంద్రశేఖర్, భూషన్, రాములు, శంకర్, రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ విభాగాల నుంచి స్పెషల్ ఆఫీసర్ (ఈవో) కృష్ణవేణి, పంచాయతీ సెక్రటరీ, ఏఈఓ, టీఏ రజితతో పాటు అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొని గ్రామాభివృద్ధి, స్థానిక సమస్యలపై చర్చించారు.

## పిడుగు పటుతో వృద్దుడు మృతి



కుంటాల జూన్ 04 (ప్రజాజ్యోతి) పిడుగు పటుతో వృద్దుడి మృతి చెందినట్లు ఎస్సై అశోక్ తెలిపరు, కుంటాల గ్రామా నికి చెందిన న్యాకా పు సుధాకర్ వ్యవ సాయ క్షేత్రంలో గురువారం,పనులు నిర్వహిస్తున్న సమ యంలో వర్షం రావడంతో మామి డి చెట్టు కిందకు వెళ్లి కూర్చొగా అదే సమయంలో పిడు గు పడి మృతి చెం దడు అటువైపుగా వెళ్తున్న పశువుల కపరులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగ పోలీసులు మరియు రెవెన్యూ అధికారులు ఘటన స్థలానికి చెరుకొని పంచనమ నిర్వహించా రు మృతిని భార్య కూతురు పిర్యాదు మేరకు కేసు నమొదు చేసుకొని పోస్ట్ మార్టం నిమిత్తం బైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు

## బాసర విద్యార్థినిలకు స్నేహితుల ఆధ్వర్యంలో సన్మానం



బాసర జూన్ 4 (ప్రజా జ్యోతి)పదవ తరగతి ఫలితాలలో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచి సీటు సాధించిన తమ స్నేహితులైన లతీఫ్ కూతురు ఫిర్దౌస్, మరియు మండల ద్వితీయ స్థానంలో నిలిచిన జావేద్ హుస్సేన్ కూతురు గుల్ఫిషా ను 1995 బ్యాచ్ కు చెందిన స్నేహితులు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇదే బ్యాచ్ కి చెందిన బాసర గ్రామ సర్పంచ్ వెంకటేష్ గౌడ్ యోగేష్ మహేష్ లతీఫ్ జావిద్ కవీందర్ వెంకట్రావు గంగాధర్ హైమద్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థినులు చదువుల్లో రాణించి తల్లి దండ్రుల పేర్లు నిలపాలని సూచించారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్ ని సన్మానించిన ఏలేటి అశ్విన్ రెడ్డి



నేరడిగొండ, జూన్ 04( ప్రజాజ్యోతి ):బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన మల్లెపూల సత్యనారాయణను ఆదిలాబాద్ జిల్లా ప్రముఖ నాయకులు ఏలేటి అశ్విన్ రెడ్డి ఘనంగా సన్మానించారు. నేరడిగొండ మండల కేంద్రంలోని అశ్విన్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ సత్యనారాయణకు అశ్విన్ రెడ్డి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. మార్కెట్ కమిటీ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి అంకితభావంతో పనిచేయాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో ప్రాంతీయ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రాబోతోంది

**కాంగ్రెస్ ప్రభుత్వానికి కాలం చెల్లింది**

**నిర్మల్ జిల్లా ప్రశిక్షణ శిభిరంలో బీజేఎల్పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి**





నిర్మల్ జిల్లా ప్రతినిధి ,జూన్ 4 ,( ప్రజాజ్యోతి ).తెలంగాణలో రాబోతుంది బీజేపీ ప్రభుత్వమేనని బీజేఎల్పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.గురువారం నిర్మల్ జిల్లాలోని బాలాజీ ఇన్ లో నిర్వహించిన పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జిల్లా స్థాయి శిక్షణ తరగతులను బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేఎల్పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు" ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో బిజెపికి అనుకూల పరిస్థితులు ఉన్న నేపథ్యంలో ప్రతి కార్యకర్త అంకితభావంతో ప్రజాక్షేత్రంలో పనిచేయాలి అని అన్నారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా కలిసి కృషి చేస్తే తెలంగాణలో కాషాయ జెండా ఎగరడం ఖాయమని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయశ్రీ రావుల రాంనాథ్ , మేడిశెట్టి రాజు యాతాళం చిన్నారెడ్డి నల్లా రవీందర్ రెడ్డి కరిపె విలాస్ సత్యం చంద్రకాంత్ బుర్ర రమేష్, జిల్లా పాదాధికారులు రాష్ట్ర నాయకులు, జిల్లాలోని మండల అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు: ఇదే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం



సోనాల, జూన్ 04 ( ప్రజాజ్యోతి ):సోనాల మండలంలోని పొరిడి ( కె) గ్రామంలో ఈరోజు గ్రామపంచాయతీ లో గ్రామసభ నిర్వహించడం జరిగింది. సందర్భంగా గ్రామ సర్పంచ్ చౌహాన్ వినోద్, సోనాల మండల ఎంపీడీవో మహేందర్ 99 రోజుల ప్రణాళికలో భాగంగా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని, గ్రామంలో ఏదైనా సమస్య ఉంటే సర్పంచ్ ,అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. రాబోవు వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్యామ్ ,గ్రామ కార్యదర్శి మండల అధికారులు, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## నకిలీ పత్రాలతో ప్లాట్ విక్రయం

**5 గురిపై కేసు నమోదు, అరెస్ట్**

**సహకరించిన డాక్యుమెంట్ రైటర్ సహా నిందితుల పై కేసు**

**ఆస్తులు కొనుగోలు చేసే ముందు పూర్తి స్థాయిలో పత్రాలు పరిశీలించాలి**

**మావల సీఐ బి డి ప్రేమ్ కుమార్**

ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 4 (ప్రజా జ్యోతి)మావల పోలీస్ స్టేషన్ పరిధి లో నకిలీ పత్రాల ఆధారంగా ప్లాట్ విక్రయించి కొనుగోలు దారుడికి ఆర్థిక నష్టం కలిగిం చిన ఘటనలో 5 గురు వ్యక్తు లపై కేసు నమోదు చేసి ఐదు గురిని అరెస్ట్ చేసినట్లు ఆదిలా బాద్ మావల సీఐ బి డి ప్రేమ్ కుమార్ తెలిపారు. జైనథ్ మండలానికి చెందిన పల మూరి జయప్రకాశ్ ఫిర్యాదు మేరకు మావల పోలీస్ స్టేషన్ లో క్రైం నెంబర్ 375/2025, సెక్షన్లు 463, 464, 467, 420 తో/వ 34 ఐపీసీ కింద కేసు న మోదు చేసినట్లు తెలిపారు. ఎ1. కే. వేణుగోపాల్ అశన్న, విద్యానగర్, ఆదిలాబాద్,ఎ2. రత్నాల రాజన్న అడెల్లు, భట్టి సావర్గావ్ గ్రామం, మావలమం డలం, ఆదిలాబాద్ జిల్లా,ఎ4. కేతిరెడ్డి కృష్ణారెడ్డి జీవన్ రెడ్డి,విద్యా నగర్, ఆదిలాబాద్. ఎ5. మొ హమ్మద్ ఫైజుద్దీన్ సిద్దిఖీ ఏ సాహెర్ వహీదుద్దీన్ సిద్ది ఖీ, డాక్యుమెంట్ రైటర్, మ సూద్‌నగర్, ఆదిలాబాద్.ఎ6. దరాడే కేశవ్‌లక్ష్మణ్, రామ్‌నగర్, ఆదిలాబాద్. భట్టి సావర్గావ్ గ్రామ శివారులోని సర్వే నెంబర్ 65లో గల ప్లాట్ నెంబర్ 161కు సంబంధించి నిందితులు పరస్పరం కుమ్మ క్కై తప్పుడు, నకిలీ పత్రాల ను సృష్టించి అక్రమ రిజిస్ట్రేష న్లు జరిపినట్లు దర్యాప్తులో వె ల్లడైందన్నారు. ఈ పత్రాల ఆధారంగా ప్లాట్‌ను విక్రయించి ఫిర్యాదుదారుడికి ఆర్థిక నష్టం కలిగించినట్లు తెలిపారు. నకి లీ యాజమాన్య పత్రాలు, మున్సిపల్ రికార్డులు సృష్టించడం, వాటిని అసలైన పత్రాలుగా ఉపయోగించడం, అక్రమంగా ఆస్తి హక్కులు పొందేందుకు ప్రయత్నించడం వంటి అంశాలు దర్యాప్తులో వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. ఈ వ్యవ హారంలో డాక్యుమెంట్ రైటర్ పాత్ర కూడా ఉన్నట్లు గుర్తించి కేసులో చేర్చినట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో భా గంగా ఐదుగురు నిందితులను అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు. భూములు, ప్లాట్లు, ఇతర స్థిరాస్తులు కొనుగోలు చేసే ముందు సంబంధిత పత్రాలు, లింక్ డాక్యుమెంట్లు, ఎన్ కంబరెన్స్ సర్టిఫికె ట్లు,రెవెన్యూ రికార్డులు, యాజమాన్య హక్కులను పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేయాలని సూచించారు. ఆస్తుల కొనుగోలు విషయంలో ఏవైనా అనుమానాలు ఉన్నా లేదా మోసాలకు గురైనట్లు భావించినా వెంటనే పోలీసుల ను సంప్రదించాలని, ప్రజల ఆస్తి హక్కులకు భంగం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలి పారు.

# నెలవారి క్రైమ్ రివ్యూ మీటింగ్ నిర్వహించిన నిర్మల్ జిల్లా ఎస్పీ

**దీర్ఘకాలిక పెండింగ్ కేసుల పరిష్కారం పై ఆదేశాలు**

**రౌడీషీటర్లపై నిఘా పెంచి నేరాలను అరికట్టాలి**

**వృద్ధులు, మహిళలు, పిల్లల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాల**

**జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల వెల్లడి**







ఖానాపూర్ జూన్ 4 (ప్రజా జ్యోతి )నెలవారి క్రైమ్ రివ్యూ మీటింగ్‌లో భాగంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, నిర్మల్ జిల్లా సమీ క్ష సమావేశం గురువారం నిర్వహించారు జిల్లాలో నేరాల నియంత్రణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజా సమస్యలను సమర్ధవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.వృద్ధులు, మహిళలు, పిల్లలపై జరిగే నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని, వారికి సంబంధించిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని తెలిపారు.దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై సంబంధిత ఎస్‌డీపీఓలు మెమోలు జారీ చేసి, వాటి పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.అందరూ ఎస్‌హెచ్‌ఓలు కేసుల పురోగతిని క్రమం తప్పకుండా నవీకరిస్తూ, పాత కేసుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అదేవిధంగా, సి సి టి ఎన్ ఎస్ డేటాను తప్పనిసరిగా నవీకరించాలని, మాన్యువల్ రికార్డులు, సి సి టి ఎన్ ఎస్ నమోదుల మధ్య ఉన్న వ్యత్యాసాలను వెంటనే సరిచేయాలని ఎస్పీ జానకి షర్మిల అన్నారు జిల్లాలో నేరాల సంఖ్యను తగ్గించేందుకు రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచి, నేరాలకు పాల్పడే అవకాశం ఉన్న వ్యక్తులపై ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ప్రజలు ఆన్‌లైన్ మోసాలపై అవగాహన పెంచుకుని జాగ్రత్తగా ఉండాలని, మోసాలకు గురైన వెంటనే మొదటి గంట లోపు 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా ఎన్ సి ఆర్ పి పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని అన్నారు ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తూ, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఫేక్ నెంబర్ ప్లేట్లు, నెంబర్ ప్లేట్ మార్పులపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు ఈ నెలవారీ నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల,తో పాటు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఉపేందర్ రెడ్డి, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు గోవర్ధన్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, కృష్ణ, రవీందర్ నాయక్, సమ్మయ్య, సాయి కుమార్, దీపక్, అన్ని పోలీసు స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులను మోసం చేసే వారిపై చర్యలు తప్పవు

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ రైతులకు అండగా జిల్లా పోలీసు యంత్రాంగం**

**రుణాలు, సబ్సిడీలు, వ్యవసాయ పరికరాలు, పంటల కొనుగోలు పేరుతో మోసం చేసే ద ళారులపై కేసులు నమోదు**

**జిల్లావ్యాప్తంగా ఈ సంవత్సరం 20, గత ఏడాది 25 కేసులు నమోదు**



ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 4 (ప్రజా జ్యోతి) రైతులను మభ్యపెట్టి మోసం చేసే వారి పట్ల కఠినంగా వ్యవ హరిస్తామని జిల్లా ఎస్పీ అఖి ల్ మహాల్ స్పష్టం చేశారు. అమాయక రైతులను లక్ష్యంగా చేసుకుని రుణాలు ఇప్పిస్తా మని, ప్రభుత్వ సబ్సిడీలు మంజూరు చేయిస్తామని, తక్కువ ధరలకు వ్యవసాయ ప రికరాలు అందిస్తామని, పంట లను అధిక ధరలకు కొనుగోలు చేస్తామని నమ్మించి మోసాలకు పాల్పడుతున్న వ్య క్తులపై కఠిన చర్యలు తీసు కుంటున్నామని జిల్లా ఎస్పీ అ ఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. జిల్లాలోని వివిధ పోలీ స్ స్టేషన్ల పరిధిలో రైతుల నుండి అందిన ఫిర్యాదుల మేరకు గత ఏడాది కాలంలో రైతులను మోసం చేసిన దళారులు, కేటుగాళ్లపై మొత్తం 25 కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం రైతులను మోసం చేసే దళారుల పై ప్రత్యేక తనిఖీలు చేపట్టి నెల రోజులలో 20 కేసులను నమోదు చేసినట్లు తెలిపారు. రైతుల కష్టార్జిత డబ్బును మో సపూరిత పద్ధతుల్లో దోచుకునే వారి పట్ల ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. వ్యవసాయ రుణాలు ఇప్పిస్తామని, ప్రభు త్వ పథకాల లబ్ధి కల్పిస్తామ ని, ట్రాక్టర్లు, వ్యవసాయయం త్రాలు తక్కువ ధరకే అందిస్తా మని, పంటలకు అధిక ధరలు ఇప్పిస్తామని చెప్పి ముందస్తుగా డబ్బులు వసూలు చేసే వ్యక్తుల పట్ల రైతులు అప్రమ త్తంగా ఉండాలని సూచించారు. పథకాల పేరుతో ప్రభుత్వ శాఖలు, బ్యాంకులు లేదా ఇతర సంస్థల పేర్లతో డబ్బులు డిమాండ్ చేసినట్లయితే పూర్తి స్థాయిలో ధృవీకరించుకున్న తర్వాతే స్పందించాలని, అనుమానాస్పద వ్యక్తులపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా రైతులతో పాటు ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉ న్నా నిర్భయంగా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించ వచ్చని ఎస్పీ తెలిపారు. ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ, మో సాలకు పాల్పడే వారి ఆట లను కట్టడి చేయడం జరుగు తుందని పేర్కొన్నారు. ప్రజల నుండి వచ్చే ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి చట్టపర మై న చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతుల ఆర్థిక భద్ర తకు జిల్లా పోలీసు శాఖ ఎల్ల ప్పుడూ అండగా ఉంటుందని, మోసాలకు పాల్పడే వారి పై కఠిన చర్యలు కొనసాగుతాయని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

## సోనాలలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల పరిశీలన



**సోనాల, జూన్ 04 ( ప్రజాజ్యోతి ):**సోనాల మండల కేంద్రంలో ఈరోజు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించిన రెండో విడత అర్హుల జాబితాను పకడ్బందీగా రూపొందించేందుకు లబ్ధిదారుల క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ ప్రత్యేక అధికారి నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి నవీన్ రెడ్డి మాట్లాడుతూ, కేవలం ప్రజా పాలన దరఖాస్తులు మరియు అర్హత ప్రమాణాల ఆధారంగానే ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోనాల పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ మరియు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## బాసరలో స్వచ్ఛ కార్యక్రమం

**బాసర్ జూన్ 4 (ప్రజా జ్యోతి)**నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి క్షేత్రంలో మహారాష్ట్రలోని దెగ్లూర్ ప్రాంతానికి చెందిన షేర్ స్వచ్ఛంద జాగర్ సంస్థ ఆధ్వర్యంలో రేపు ఉదయం 7 గంటలకు స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ పరిసరాలతో పాటు గోదావరి ఘాట్ ప్రాంతాన్ని పరిశుభ్రం చేయనున్నట్లు వెల్లడించారు. గత 11 ఏళ్లుగా వివిధ ప్రముఖ పుణ్యక్షేత్రాలు, ప్రజా ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపడుతున్నామని సంస్థ సభ్యుడు సూర్యకాంత్ సువార్ణకార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## ఈ వారంలో

## ఇంటర్ సప్లిమెంటరీ రిజల్ట్స్

**హైదరాబాద్ :** తెలంగాణలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 21వ తేదీతో ముగిసిన సంగతి తెలిసిందే. ఇక ఈ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ కూడా ముగిసింది. ఈ క్రమంలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాసిన విద్యార్థులకు విద్యాశాఖ కీలక సమాచారం వెల్లడించింది. ఫలితాలను మరో 5 రోజుల్లోనే వెల్లడించనున్నట్లు తెలిపింది. అంటే జూన్ 10వ తేదీలోపు ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు ఇంటర్ బోర్డు విడుదల చేయనుంచి. ఈ మేరకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.ఇప్పటికే జవాబు పత్రాల మూల్యాంకనం, స్కానింగ్ ప్రక్రియలు కూడా పూర్తయ్యాయి. ప్రస్తుతం ఫలితాల విడుదలకు సంబంధించిన తుది సాంకేతిక కసరత్తు జరుగుతుంది. వచ్చే వారంలో ఫలితాలు వెల్లడించనున్నారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా మే 12 నుంచి మే 21 వరకు ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షలకు గరిష్ట స్థాయిలో మొత్తం 3,98,358 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్ ఫలితాలు వెలువడితేగానీ ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలవదు. దీంతోపాటు డిగ్రీ ప్రవేశాలు, ఇతర ఉన్నత విద్యా అడ్మిషన్ ప్రక్రియలు కూడా త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఫలితాలను త్వరగా ప్రకటించాలని అధికారులు భావిస్తున్నారు.కాగా ఈ ఏడాది ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 3,98,358 మంది విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించారు. దీంట్లో జనరల్ విభాగంలో మొత్తం 3,69,294 మంది విద్యార్థులు, ఒకేషనల్ విభాగంలో 28,703 మంది విద్యార్థులు ఉన్నారు.

# 66 లక్షల విలువ చేసే 330 మొబైల్ ఫోన్లు బాధితులకు తిరిగి అందజేత

మొబైల్ ఫోన్ పోయిందా.. సీ ఈ ఐ ఆర్ లో ఫిర్యాదు చేయాలి మొబైల్ ఫోన్లు తిరిగి రాబ ట్టడం కోసం ప్రత్యేక బృందం ఏర్పాటు

రైతు బజార్, బస్టాండ్, రైల్వే స్టేషన్, రిమ్స్ ప్రదేశాలలో జా గ్రత్తలు పాటించాలి సెల్ఫోన్ దొంగలపై కేసులు నమోదు చేయాలని ఆదేశాలు

జిల్లాలో ఒక సంవత్సరంలో 1500 మొబైల్ ఫోన్లు బాధితులకు తిరిగి అందజేత

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ తిరిగి పొందిన సందర్భంగా సంతోషం వ్యక్తం చేసిన బాధితులు

జిల్లా ఎస్పీకి ఎంతగానో కృత జ్ఞతలు, ధన్యవాదాలు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 4 (ప్రజా జ్యోతి)**మొబైల్ ఫోన్ లేనిదే ఎలాంటి పని జరగని ఈ అధునాతన స మాజంలో మనకు అత్యంత విలువైనది, తక్కువ సమయంలో ఎక్కువ పని చేసేసాం కేతిక పరికరం మొబైల్ ఫోన్. మొబైల్ ఫోన్లో అన్ని వివరాలు, అన్ని జ్ఞాపకాలు, అన్ని లావాదేవీలకు సంబంధించిన అప్లికేషన్లు ఉంటాయి,సాధార ణంగా ప్రజలు మొబైల్ ఫోన్లు పోగొట్టుకోవడం, దొంగలించ బడటం జరుగుతుంది. పోగొట్టుకున్న, దొంగలించ బడిన వాటిని పొందాలంటే,బాధితులు వెంటనే అనే వెబ్సైట్‌లో లేదా దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేష న్లో సంప్రదించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలియజేశారు. ఆదిలాబాద్ జిల్లా లో ఇలా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి సంపాదించడం కోసం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ ప్రత్యే కంగా రికవరీ బృందాన్ని ఏర్పాటు చేశారని, ఇలా జిల్లా ఎస్పీ ఆదేశాలతో వీరు వివిధ రాష్ట్రాల నుండి జిల్లాల నుం డి బాధితులు పోగొట్టుకున్న టువంటి, దొంగలించబడిన టువంటి 330 మొబైల్ ఫోన్ లను తిరిగి రాబట్టడం జరిగింది. జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజు నుండి ఇప్పటివరకు ఒక సంవత్సర కాలంలో 1500 మొ బైల్ ఫోన్లను తిరిగి రాబట్టడం జరిగింది. ఇలా ఇంత మొత్తం లో రాబట్టడం జిల్లా చరిత్రలోనే ప్రథమం, మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు దాదాపు మధ్యతరగతి కుటుంబీ కులు, బీదవారు వారు ఎంత గానో కష్టపడి కొనుక్కున్నమొ బైల్ ఫోన్ను తిరిగి వారికి అందజేయాలనే సదుద్దేశంతో ఈ బృందాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా మొబైల్ ఫోన్ దొంగతనాలు జరిగే ప్రాంతాలు రైతు బజార్, రిమ్స్, రైల్వే స్టేష న్, బస్టాండ్, ఇళ్లలో దొంగత నాలు, బంధువులకు ఫోన్ చే స్తానంటూ ఫోన్ తస్కరించడం లాంటివి జరుగుతున్నాయని వాటి వల్ల అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు పా టించాలని తెలిపారు. మొబైల్ ఫోన్లను తిరిగి ఇచ్చే క్రమంలో గురువారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశంమం దిరంలో




ఆదిలాబాద్ జిల్లాలో మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న, చోరీకి గురైనటువంటి బాధితులకు 330 మొబైల్ ఫోన్లు (దాదాపు 66 లక్షల విలువ చేసే ) వివిధ ప్రాంతాల నుండి తెప్పించి బాధితులకు తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి అందుకున్న బాధి తులు సంతోషం వ్యక్తంచేస్తూ, జిల్లా ఎస్పీకి ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసా గుతుందని, ప్రతి నెల రోజులలో పోగొట్టుకున్నటువంటి మొబైల్ ఫోన్లను తిరిగి రాబట్టి బాధితులకు అందజేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. బాధితులు మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వెంటనే దగ్గర్లో ఉన్న సంబంధిత పోలీస్ స్టేషన్ను సంప్రదించాలని తెలి పారు. ముఖ్యంగా రాబట్టిన మొబైల్ ఫోన్లు ఉత్తర భారత దేశంలో ఉండటం వాటిని ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో తిరిగి రాబట్టడం జరిగిందని తెలిపారు. మొబైల్ దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందం ఏర్పాటు చేయడం జరి గిందని, దొంగలించిన పడిన మొబైల్ ఫోన్ల కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదిలాబాద్ డి.ఎస్.పి ఎల్ జీ వన్ రెడ్డి, ప్రత్యేక బృందం స భ్యులు, ఆర్ ఎస్ ఐ పి గోపి కృష్ణ, ఎం ఎ రియాస్, మజీ ద్, త్రిశూల్, అన్వేష్, నవనీత్ సిబ్బంది తదితరులు పాల్గొ న్నారు.

# మన పూర్వీకుల కాలంలో ఉన్న అడవుల్లో చాలా భాగం కనుమరుగైపోయింది

**కొన్ని జాతుల వన్య ప్రాణులు అంతరించి. పోయాయి ఈతరం పిల్లలు చూడలేక పోయారు**

**ఉన్న అటవీ సంపదనైనా కాపాడుకొని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉంది:బి**

**సిర్పూర్ (టి) ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్:బిబి**

**జూన్ 4, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అటవీ క్షేత్రాధికాది కార్యాలయంలో పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ ప్రకృతి వనరు లపై విద్యార్థులకు వివరించి,విశ్లేషించి, కులుప్తకరించి అవగాహన కల్పించారు. అనంతరం డిఆర్ఓ తిరుపతి, సెక్షన్ అధికారులు మోహన్ రావు బాలాజీ సిబ్బందితో కలిసి ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ మాట్లాడుతూ..అడవులు, వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు మన పూర్వీకుల కాలంలో ఉన్న అడవుల్లో చాలా భాగం కనుమరుగై పోయాయని,



తెలిపారు. కొన్ని జాతుల వన్య ప్రాణులు అంతరించి పోయాయని అన్నారు. వాటిని ఈ తరం పిల్లలు చూడలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న అటవీ సంపదనైనా కాపాడుకుని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్, డీఆర్వో తిరుపతి, సెక్షన్ ఆఫీసర్లు మోహన్ రావు, బాలాజి మరియు అటవీ సిబ్బంది పాల్గొన్నారు.